# మిసిమి

మాస పత్రిక

సెప్టెంబర్ - 2003



రూ. 8/-

## చిత్రకారుని గురించి



రెనార్ (1841 - 1919)

పిరె - అగస్ట్ రెనార్ (1841-1919), ముద్రావాద శైలికి (impressionism) సంబంధించిన అత్యంత ముగ్ధ మనోహరమైన చిత్రాలను చిత్రించాడు. ఇతడు మొదట పారిస్‌లో చిన్న ఫ్యాక్టరీలో పింగాణీ పాత్రల మీద బొమ్మలు వేసేందుకు శిక్షణ పొందాడు. 19వ యేట ఒక వృత్తి కళాకారుడుగా ఉన్న అతడు చిత్ర కళాకారుడుగా పరివర్తనం చెందాడు.

అతడి సుదీర్ఘ కళావృత్తిలో, శైలి సంబంధితాలైన అనేక మార్పులు చోటు చేసుకొన్నప్పటికీ, అతడి కళాఖండాలు మాత్రం ఎప్పుడూ సంతోషాన్నే పంచి యిచ్చాయి. ఆ చిత్రాలన్నీ స్వప్నాల్లా, వెలుగు - రంగుల విచ్చలవిడి ప్రపంచాన్ని వెదజల్లాయి. ఆ ప్రపంచంలో అందాల బరిణెలు తమ ప్రియులతో నృత్యం చేశారు, గానం చేశారు.

అతడి ముద్రావాద చిత్రాలను విమర్శకులు ఎగతాళి చేశారు. పదిహేను సంవత్సరాల పాటు పెనగులాట తరవాత రెనార్, తన నలభయ్యోయేట సామాజిక చిత్రణకు పూనుకొన్నాడు. సుఖవంతమైన కుటుంబ జీవితంలో కుదురుకున్నాడు. తరవాత అతడు మేహవాతంతో నడవలేకపోయాడు. దక్షిణాదిన రివేర్‌కు మకాం మార్చాడు. చనిపోయేవరకు అతడు రోజూ చిత్రిస్తూనే ఉన్నాడు.

### ముఖచిత్రం : అందమైన భార్యతో చిత్రకారుడు

గ్రామీణ ప్రాంతంలో నృత్యం చేసే ఈ చిత్రంలో కనిపించే ఆమె (1883) పెళ్ళీడుకొచ్చిన పిల్ల.

(మూడవ, నాల్గవ అట్టలపై చిత్రాలు కూడా రెనార్ చిత్రించినవే)

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**


సంపుటి 14 సెప్టెంబర్ 2003 సంచిక 9

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


| | |
|---|---|
| కథన కుతూహలం | - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి<br>- సుమనస్పతి రెడ్డి |
| రవీంద్రనాథ్ టాగోర్ | - మూలం : హెరాల్డ్ జార్జె<br>- అనువాదం: బి.వి. రామిరెడ్డి |
| కాల జ్ఞానం | - వి. అశ్వని కుమార్ |
| నాగార్జునుని 'సుహృల్లేఖ' | - డా॥ మలయశ్రీ |
| మూడవ కన్ను | - వింజనంపాటి రాఘవరావు |
| ఆత్మలో స్థాపితమైన రమణ మహర్షి | - డాక్టర్ దేవరాజు మహారాజు |
| సమసమాజం గురించి | - డా॥ సర్దేశాయి తిరుమలరావు |
| సాదత్ హసన్ మంటో | - డా॥ మానేపల్లి |



విడి ప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **చిత్రకారుడు - పిరె-ఆగస్ట్ రెనార్ - అతని భార్య**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyd - 20. Ph. 27645536

E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# కథన కుతూహలం

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

మానవ జీవితానికి అర్థాన్ని (meaning), సాకూతత (significance) ను చేకూర్చే కథనం (narrative) మీద నవంబరు 2003 'మిసిమి' సంచికను ప్రత్యేక సంచికగా వెలువరించదలచాము. ఉత్తమాభిరుచి గలిగిన 'మిసిమి' పాఠకులు సానుకూలంగా ప్రతిస్పందించి, అచ్చులో 5, 6 పుటలకు మించని 'కథనం' మీద తమ వ్యాసాలను అక్టోబరు మొదటి వారంలోగా పంపవలసిందిగా ఆహ్వానిస్తున్నాం. - సంపాదకుడు

మనిషి ఎప్పుడూ ఏదో ఒకటి చెప్పాలని తపన పడుతూ ఉంటాడు. అతడు ఏమీ చెప్పకుండ ఉండలేడు. ఆత్మాభివ్యక్తీకరణం (self-expression) ఒక అవసరం (need). అతడేమి చెబుతాడు? తన జీవితంలో ఎదుర్కొన్న సంఘటనలను, అనుభవాలను, ఆలోచనలను ఇతరులతో పంచుకొంటాడు. ఇలా చెప్పే 'విషయం' కథ అయితే-చెప్పే ప్రక్రియ 'కథనం' (narration) అవుతుంది.

కథ యథాతథ సంఘటనల కూర్పు అయితే-కథనం వాటి పునరావిష్కారం (representation) అవుతుంది. వాస్తవ సంఘటనలు కథనంలో రూపాంతర పరిణామం (transformation)కు గురవుతాయి. అయితే పునరావిష్కార రూపాలు అనేకం.

మనిషి కథలు చెప్పడానికి ఎందుకంత ఉత్సాహం చూపిస్తాడు? మానవునికి చేతనం (conscious) కాక, ఆత్మచేతనం (self-conscious) ఏర్పడిన నాటి నుంచే కథనీకరణం పుట్టింది. ఆత్మ చేతనం అంటే ''నేను'' అనే భావన అతనికి ఏర్పడడం. ఈ ప్రపంచంలో అతడు ''నేను''తో పని చేస్తాడు. ఆ తరవాత ఈ 'నేను' చేసే పనులను కథనంలో భాగంగా చూస్తాడు. గతాన్ని కథనీకరించడం ద్వారా తన అస్తిత్వానికి అర్థాన్ని కల్పించే ప్రచోదన మనిషిలో అంతస్సిద్ధంగా ఉందని మనోవైజ్ఞానికుల్లో కొందరి అభిప్రాయం. అంతేకాదు ఆ ప్రచోదన ఆత్మార్థాన్ని కాపాడుతుందని చెప్పారు. (ఇక్కడ ఆత్మ వేదాంతుల ఆత్మ కాదు, self కు సమానార్థకం)

కథనం అనేది కాలంలో, సంస్కృతిలో నిర్మితమవుతుందనేది కొంత వరకు సత్యమే అయినా, కథన కుతూహలం, కథన సంబంధ మానుష సంసిద్ధత (innate human readiness) ఒకటి ఉందని భావించడం అనుచితమా? కారక ప్రక్రియ (syntax), లేదా వ్యాకరణ రూపాలకు సంబంధించిన ''అంతస్సిద్ధ సంసిద్ధత'' (innate readiness) ఒకటి పిల్లల్లో ఉందని అమెరికన్ భాషా శాస్త్రవేత్త నోమ్ చోమ్స్కీ నిర్ధారించిన సంగతి విదితమే.

కథనం మానవుని ఆత్మ చైతన్యావిర్భావంతో ప్రారంభమైనా అది ఒక శాస్త్రంగా రూపొందింది 1966లో. ఆ తరవాత 1999లో మొదటిసారిగా 'కథనశాస్త్రం' (narratalogy) అనే పేరు సృష్టింపబడింది. అక్కడ నుంచి అది అనేక రూపాలు సంతరించుకొని, విస్తరిల్లి ఎవరు ఏమి చెబుతున్నారో అర్థంగాని గందరగోళ స్థితి ఏర్పడింది.

భారతదేశంలో పంచతంత్ర కథల నాటి నుంచే 'కథన కళ' (art of narration) ప్రౌఢమైంది. భారతీయ కథన కళను ఇతర సంస్కృతుల కథన కళతో పోల్చి అయ్యప్ప పాణికర్ భారతీయ కథన

(మిగతా 288వ పేజీలో...)

# రవీంద్రనాథ్ టాగోర్

## (1913వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారోపన్యాసం)

**అతని ఉన్నత, సుకుమార, స్వచ్ఛ, సౌందర్యాన్వితమైన కవిత్వానికి, అతని కవిత్వంతో, కవిత్వాలోచనతో, కళాకౌశలంతో, తనదైన ఆంగ్ల పదజాలంతో, పాశ్చాత్య సాహిత్యంలో భాగంగా, అతనికీ పురస్కార ప్రదానం చేయబడింది.**

మూలం: హెరాల్డ్ జార్నె (ఛైర్మన్, నోబెల్‌కమిటి, స్వీడిస్ అకాడెమి)

అనువాదం: - బి. వి. రామిరెడ్డి

ఈ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారాన్ని ఇండో ఆంగ్లియన్ కవి రవీంద్రనాథ్ టాగోర్‌కి ప్రదానం చేయడానికి మా అకాడెమీ ఆనందిస్తున్నది. ఈ పురస్కార ప్రదానం ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకనుగుణంగా, ఈ ఆదర్శవాద కవితలకు ప్రదానం చేయాలని నిర్ణయించబడింది. విస్తృత చర్చానంతరం ఈ కవితలు అత్యుత్తమ స్థాయికి చెందినవిగా ఈ అకాడెమి భావిస్తున్నది. ఈ కవి పేరు ఇప్పటికీ యూరోపులో అంతగా ప్రాచుర్యం పొందలేదు. కారణం, అతడు సుదూరమైన ప్రాచ్యదేశానికి చెందినవాడు కావడమే. ఈ పురస్కార ప్రదానంలో దేశ భేదాలుండరాదన్న నోబెల్ నిర్ణయానుసారంగానే ఈ కవిని ఎంచుకోవడం సరైన నిర్ణయం.

టాగోర్ 'గీతాంజలి' (అర్పణా గీత సుమాలు 1912) ఒక భక్తి సంప్రదాయ కవితా సంకలనం. అతడి అనేక సంకలనాలలో ఒకటైన ఈ కవితా సంకలనం నిర్ణాయిక మండలి అభిమానాన్ని చూరగొన్నది. గత సంవత్సరం నుండి ఈ కవితా గ్రంథం ఆంగ్ల సాహిత్యంలో భాగమైపోయింది. ఈ భారతీయ కవి తన కవితల కొక క్రొత్త సౌందర్యాన్ని ప్రసాదించాడు. కవితా శరీరానికీ, కవితాత్మకు రెంటికీ మధ్య గొప్ప సమతౌల్యాన్ని సాధించి, ఉన్నతమైన భావ తీవ్రతలో వాటిని ముంచెత్తాడు. అందువల్ల ఈ కవి ఇంగ్లండు, అమెరికా దేశాలకేగాక మొత్తం పాశ్చాత్య ప్రపంచానికి వాటిని పరిచయం చేసి నోబెల్‌సాహితీ పురస్కారాన్ని కైవసం చేసుకున్నాడు. అతని మత నమ్మకాలతో ఏకీభవించనివారు, వేరు వేరు సాహిత్య రాజకీయ నమ్మకాలున్నవారు కూడ టాగోర్‌ను కవితా కళలో మహాకవిగా అంగీకరించారు. ఆ విధంగా అతడు ఎలిజబెత్ రాణి పాలనా కాలం నుండీ ఆంగ్ల సంస్కృతీ వికాసానికి తోడ్పడ్డాడు. అందరికీ అభిమానపాత్రమైన అతని కవితా సౌందర్యం, భావసౌందర్యం, లయాత్మకశైలి, గ్రీస్ ధీరత్వాన్ని సంతరించుకున్నాయి. అతని స్వచ్ఛమైన అభిరుచికి తగినట్టుగానే అతని పదాలు తనది కాని పర భాషలో కూడ అవే లక్షణాలను సాధించుకుని అది ఆంగ్ల రచనే అనిపించేట్టు, ఇతర భాషలలోనికి అనువాద సాధ్యం కాని విధంగా రచించాడు.

ఈ కవితా సంకలనమే గాక అతని ఇతర కవితా సంకలనాలైన ''ది గార్డెనర్'', ''లిరిక్స్ ఆఫ్ లౌ అండ్ లైఫ్'' కూడా ఇవే లక్షణాలను కలిగి వున్నాయి. వీటిలో కవి వ్యక్తిత్వంలోని రెండోవైపు - యౌవన ప్రేమయొక్క మధుకీల, జీవనపిపాస, ఆనందం లాంటి అనుభూతులు ఊర్ధ్వ లోకపు అంచుల్ని స్పృశిస్తాయి.

టాగోర్ కథానువాదాలు ''గ్లింప్సెస్ ఆఫ్ బెంగాల్‌లైఫ్'' మకుటంతో 1913లో ప్రచురింపబడ్డాయి. వీటిని వేరే వారు అనువదించడం వల్ల టాగోర్ ముద్ర కనుపించదు. అయినప్పటికి వీటిలో టాగోర్ బహుముఖీన ప్రతిభ, అతని సహానుభూతి, సృజనాత్మకత కనిపిస్తాయి.

---

బి. వి. రామిరెడ్డి, సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

ఠాగోర్ ''ది క్రెసెంట్ మూన్'' (1913) ఇది కవితా చిత్రాల సంకలనం. దీని తరువాత, అమెరికన్, ఆంగ్ల విశ్వవిద్యాలయాల్లో ఇచ్చిన ఉపన్యాసాలు ''సాధన'', ''ది రియలైజేషన్ ఆఫ్ లైఫ్'' (1913) పేరుతో ప్రచురింపబడ్డాయి. వీటిలో మనిషి తనదైన నమ్మకాన్ని సృజించుకోవడం, ఆ నమ్మకంతో జీవించడాన్ని గురించి తన అభిప్రాయాలను వివరించాడు. నమ్మకానికి, ఆలోచనకు మధ్య నిజమైన సంబంధాన్ని వెదకడంలోనే కవిగా ఠాగోర్ గొప్పదనం వ్యక్తమవుతుంది. వీటిలో తన సహానుభూతిని రూపసమన్వితమైన భాషలో వ్యక్తపరిచాడు. భావాత్మక సాహిత్యంలో ఠాగోర్ గొప్ప విలక్షణతను సమతౌల్యాన్ని సాధించడమే గాక, ఆత్మ అనంతత్వాన్ని అందుకునే ప్రయత్నంలో, బాల్యం, దానికి సంబంధించిన చిలిపితనపు ఆటను ఠాగోర్ గొప్పగా విశ్లేషించాడు.

ప్రపంచ మానవతా రూపమైన అతని కవిత్వాన్ని అర్థం చేసుకునే ప్రయత్నంలో రాబోయేకాలం తన అవగాహనను పెంచుకుంటుంది. సంస్కృతియొక్క రెండు విలక్షణ విశాలాకాశాలను సమన్వ యించే కవి ప్రయత్నంలో ఈ కవితా గ్రంథం యొక్క నిజమైన అంతర్ముఖీనత విపులంగా, స్వచ్ఛంగా ఆవిష్కృతమైంది. ఆవిధంగా ప్రపంచ క్రైస్తవ సందేశాన్ని ప్రభావితం చేసింది. రాబోయే కాలాల్లో ఈ ప్రభావాన్ని, దాని ప్రాధాన్యాన్ని ఎలా అంచనా వేయాలో చారిత్రక పరిశోధనలు తెలుసుకుంటాయి. ఈ విషయంలో రాబోయే తరాలవారు మనకంటే ఉన్నతమైన అవగాహనను పెంపొందించుకుంటారు. ఈ స్వచ్ఛమైన కవితా సెలయేళ్ళు ఏ కలల ప్రపంచ మూలాల్లోంచి ఉద్భవించాయో, ఆ ఉద్యమానికి మనం కృతజ్ఞులమై వుండాలి. క్రైస్తవ మత ప్రచారం ప్రాంతీయ భాషా జీవనాన్ని పునరుజ్జీవింపజేసింది. దాన్ని ప్రాచీన బంధనాల నుండి, కృతక లక్షణాల నుండి విముక్తం చేసి జీవాత్మకమూ, కవితాత్మకమూ చేసింది.

క్రైస్తవ మత ప్రచార ప్రభావం భారత దేశంలోని ప్రాంతీయ, ప్రాచీన పవిత్ర భాషలమీద, క్రొత్త సాహిత్యం మీద పడింది. బెంగాల్‌లో కేరీ అనే క్రైస్తవ మిషనరీ క్రైస్తవ మత ప్రచారాన్ని ప్రారంభించాడు. ఆకాలంలోనే 1861 ఠాగోర్ అనేక రంగాలను ప్రభావితం చేసిన ఒక సంపన్న, గౌరవనీయ కుటుంబంలో జన్మించాడు. ఠాగోర్ బాల్య యౌవనాల మీద పరిసరాల ప్రభావం వుంది. అతని కుటుంబంలోనే కళారాధన, అన్వేషణ తరతరాలుగా తాతల తండ్రుల నుండి వున్నది. ఆ విధంగా అతడు క్రొత్త సాహితీ ప్రభావాల మధ్య పుట్టి పెరిగాడు. ప్రభుత్వం సంస్కరణలను ప్రోత్సహించిన రోజులవి.

ఠాగోర్ తండ్రి బ్రహ్మ సమాజీకుడు. బ్రహ్మ సమాజం ప్రాచీన హిందూ మతంలోని ఒక శాఖ. ఈ మతంలో విగ్రహారాధనకు తావులేదు. అన్ని మత నమ్మకాలను గౌరవించే విశాలత్వం దానికుంది. దీన్ని 19వ శతాబ్దపు ప్రథమార్ధ భాగంలో స్థాపించారు. దీన్ని స్థాపించిన వ్యక్తి జ్ఞాని, పలుకుబడిగలవాడు. అతడు ఇంగ్లండులో చదివే రోజుల్లో క్రైస్తవ మతం వల్ల ప్రభావితుడైనాడు. అతడు ప్రాచీన హిందూ మతానికి క్రొత్త, విశాల దృక్పథాన్నివ్వాలని భావించాడు. అతని క్రొత్త సిద్ధాంతం ఎందరో మేధావులను ఆకట్టుకుంది. ఇది ఆధునిక విద్యను, సాహిత్యాన్ని ప్రోత్సహించింది. దీనికోసం ఠాగోర్ కూడా విశేషంగా కృషిచేశాడు. బ్రహ్మ సమాజీకులకు ఠాగోర్ యెడల ఎనలేని భక్తి ప్రపత్తులుండేవి. వారతన్ని ఒక ప్రవక్తగా భావించారు.

తన జీవిత ధ్యేయాన్ని సాధించేందుకు ఠాగోర్ ప్రాచ్య, పాశ్చాత్య బహుముఖీన సంస్కృతిని తనలో ఇముడ్చుకున్నాడు. ఈ సంస్కృతిని లండన్‌లో విద్యాభ్యాస సమయంలోను, విస్తృత పర్యటనల

ద్వారాను సాధించుకున్నాడు. అతి చిన్న వయసులోనే తమ మాతృభాష బెంగాలీలో వచనం, కవిత్వం, భావగీతాలు, నాటకాలు వ్రాయడం ప్రారంభించాడు. తన మాతృదేశపు సామాన్య ప్రజల జీవితాన్నే గాక, సాహిత్య విమర్శ, తత్త్వశాస్త్రం, సామాజిక శాస్త్రం లాంటివాటి మీద కూడ రచనలు చేయడం ప్రారంభించాడు. కొంతకాలం పద్మానది మీద పడవలో ధ్యానం చేస్తూ సాధకుడిగా గడిపాడు. పశ్చిమబెంగాల్‌లో 'శాంతినికేతన్'ను స్థాపించి, ఎందరో యువ విద్యార్థులకు శిక్షణనిచ్చి, తన బోధనలను దేశమంతటా వెదజల్లాడు. ప్రస్తుతం ఠాగోర్ అక్కడే విశ్రాంతి జీవితాన్ని గడుపుతున్నాడు.

తన మనసును వికసింపజేసుకుని ఠాగోర్ సాధించుకున్న విద్యాభ్యాసంతో పాశ్చాత్య జ్ఞాన భాండాగారం నించి అందరికీ అర్థమయ్యే భాషలో రచనలు చేశాడు. మహామేధావి అనిపించుకోవాలని ఠాగోర్ ఎప్పుడూ తాపత్రయ పడలేదు. పాశ్చాత్య ప్రపంచపు పట్టణ జీవితపు అశాంతికి, ప్రకృతిని జయించి లాభాన్ని పొందాలనే సంఘర్షణాత్మక జీవితానికి వ్యతిరేకంగా, వారి ఉరుకుల పరుగుల జీవనశైలికి విరుద్ధంగా, విస్తృతమూ, ప్రశాంతమూ, అరణ్యాల నుండి లభించే సమగ్ర సంస్కృతిని, దానిద్వారా పొందే అనంతమైన ఆత్మశాంతిని ప్రకృతితో సమతౌల్యాన్ని సాధించడంద్వారా పొంద వచ్చునని నిరూపించాడు. తన కవితా చిత్రాల ద్వారా మన కోసం నిరీక్షించే శాంతిని విశదపరిచాడు. తనదైన దివ్యదృష్టితో ఆ సుందర దృశ్యాలను మన మనోనేత్రాలముందు ప్రదర్శించాడు. తన దేశపు అత్యున్నత సంస్కృతీ ప్రభావాన్ని ప్రపంచానికి అందించాడు. వేద సూక్తాల నుండి, ఉపనిషత్తుల నుండి, బుద్ధుని బోధనల నుండి సత్యావిష్కారాన్ని గావించాడు. సర్వశక్తివంతమైన ప్రకృతిలో దివ్యత్వాన్ని దర్శించాడు. ఆ దివ్యత్వరూపాలను, సూక్ష్మతలతోను, ఔన్నత్యంతోను మామూలు జీవితంలో మానవాత్మాలో వ్యక్తపరిచాడు. కీర్తన, ప్రార్థన, అర్పణలను ఈ గీతాంజలి అర్పణా గీత కుసుమాల నిండా నింపి తన నామ రహిత ప్రభువు పాదాల దగ్గర అర్పిస్తాడు. అతని ప్రభువును ప్రార్థించేందుకు వేద ఋషుల పవిత్రత అవసరంలేదు. అతనిది సౌందర్య భరిత విశ్వాసం. ఆవిధమైన పవిత్రతతో అతని కవిత్వం పునీతమయింది. అది అతనికి దివ్యశాంతిని ప్రసాదించింది. ఆ శాంతి అలసిపోయిన అన్నిమతాల ఆత్మలకు శాంతినిస్తుంది.

దీన్ని మనం మార్మిక వాదం అంటాం. కాని అది కేవలం మార్మిక వాదం కాదు. ఏ అధికారాన్నీ, అధికృతమూ ఆశించని వ్యక్తిత్వం, తనలోకి వొచ్చే అన్నింటినీ, అంతటినీ, తీసుకునే సర్వశక్తివంతమైన ఆత్మ సజీవ ప్రభువును, సర్వసృష్టి కర్తను కలుసుకునేందుకు ఆర్తితో ముందుకు వెడుతుంది. ఇలాంటి మార్మికత భారత దేశానికి క్రొత్తేమీకాదు. ప్రాచీన ఋషులు, తాత్త్వికులు, అనేక భక్తి రూపాలతో, పవిత్రతతో, ప్రేమతో, దైవంమీద నమ్మకంతో జీవించారు. మధ్యయుగాల కాలం నుండీ క్రైస్తవ, ఇతర మతాల ప్రభావంవల్ల హిందూమతంలోని భక్తి అనేక క్రొత్తరూపాలను సంతరించుకుంది. ఠాగోర్ ప్రపంచ మానవాళిని తన శాంతి మార్గానికి దగ్గరగా తీసుకున్నాడు. వారందరికీ తన అర్పణా గీతాల ద్వారా శుభాశీస్సుల్నీ, శుభకామనల్నీ అనంతమార్గాలు అందించాడు. ఠాగోర్ ఆలోచనలను రేకెత్తించే తన కవితా చిత్రాలద్వారా అశాశ్వతమైనవన్నీ శాశ్వతత్వంలో కలిసిపోతాయని నిరూపించాడు.

''ప్రభూ! నీ హస్తాల్లో కాలం అనంతం. ఎవ్వరూ నీ ఘడియల్ని లెక్కించలేరు.

దివారాత్రులు వెళ్ళిపోతాయి, యుగాలు పుష్పాల్లా వికసించి, వాడి రాలిపోతాయి. ఎలా నిరీక్షించాలో నీకు తెలుసు.

నీ శతాబ్దాలు ఒక అడివి పువ్వును సమగ్రీకరించే ప్రయత్నంలో ఒకదాని వెంట ఒకటిగడిచిపోతాయి.

వృథా చేసేందుకు మాకు సమయంలేదు; అందుచేత ఉన్నంతలోనే మా అవకాశాలను అందుకునేందుకు తాపత్రయ పడతాం; ఆలస్యానికి అవకాశం లేని పేదలం.

ఆవిధంగా కాలం గడిచిపోతుంది, నేను గొణుక్కునే ప్రతిమనిషికీ దాన్నిచ్చే లోపునే, నీపాద పీఠం చివరిదాకా ఏ అర్పణాలేకుండా ఖాళీగానే వుంది.

దినాంతాన నీ కవాటాలు మూసుకుంటాయనే భయంతో పరుగెత్తుకు వొస్తాను; కాని ఇంకా సమయం మిగిలే వుండడం గమనిస్తాను.''

(గీతాంజలి-82)

**అంగీకారం**

ఠాగోర్ పంపిన టెలిగ్రాంను బ్రిటీష్ విషయాల అధిపతి శ్రీ క్లైవ్ చదివారు - ''తన విశాలమైన అవగాహనతో దూరాన్ని దగ్గర చేసిన, అగంతకుని సోదరునిగా చేసిన స్వీడిష్ అకాడెమీకి కృతజ్ఞతలు తెలియ జేయవలసినదిగా మిమ్మలను అర్థిస్తున్నాను.''

**జీవితచరిత్ర**

రవీంద్రనాథ్ ఠాగోర్ (1861-1941) బ్రహ్మసమాజ నాయకులైన శ్రీ దేవేంద్రనాథ్ ఠాగోర్ కనిష్ఠ పుత్రుడు. ఇంటిదగ్గరే విద్యాభ్యాసం ప్రారంభించాడు. పదిహేడేళ్ళ వయసులో చదువుకోసం ఇంగ్లండు వెళ్లాడు. అక్కడ చదువు పూర్తిచేయలేదు. పెరిగి పెద్దవాడయ్యాక తన కుటుంబ ఆస్తుల వ్యవహారాలను తనే చూసుకున్నాడు. ఆవిధంగా మామూలు మనుషులతో సంబంధాలేర్పడ్డాయి. సంఘ సంస్కరణలో అభినివేశాన్ని పెంచుకున్నాడు. శాంతినికేతన్ పేరుతో, ఉపనిషత్తుల ఆధారంగా, ఆదర్శ విద్యాలయాన్ని స్థాపించాడు. భారత స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకున్నాడు. గాంధీజీకి ఆత్మీయుడిగా ఉన్నాడు. బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు సర్ బిరుదు ప్రదానం చేసింది. భారతదేశంలో బ్రిటీషు విధానాలకు నిరసనగా తన బిరుదును త్యజించాడు.

తన మాతృదేశంలో రచయితగా పేరు సంపాయించాడు. పాశ్చాత్యదేశాల ఉపన్యాస పర్యటనతో ఆయనకు గుర్తింపు వచ్చింది. తన బెంగాలీ కవితల ఆంగ్ల తర్జుమాలతో పాశ్చాత్యదేశాల్లో కవిగా గొప్ప గుర్తింపు పొందాడు. ప్రపంచానికి భారతదేశపు ఆధ్యాత్మిక ప్రతినిధిగా తన వాణిని వినిపించాడు. అతనొక మహా సంస్థ.

ఠాగోర్ అన్ని సాహితీ ప్రక్రియలను పరిపుష్టం చేశాడు. అయితే కవిగానే ఆయన్ను ప్రపంచం గుర్తించింది. ఆయన సుమారు యాభై కవితా సంకలనాలను వెలయించాడు. మానసి (1890), సొనార్‌తారి (1894), గీతాంజలి (1910), గీతి మలయ (1914), బాలక (1916) అతని ప్రసిద్ధ కవితా సంకలనాలు. అతని ఆంగ్లానువాదాలు - ''ది గార్డెనర్ (1913), ఫ్రూట్ గేదరింగ్ (1916), ది ఫ్యూజిటివ్ (1921), గీతాంజలి (1912) ప్రసిద్ధమైనవి. ఠాగోర్ ప్రధాననాటకాలు - రాజా (1910), ది కింగ్ ఆఫ్ ది డార్క్ ఛేంబర్ (1912), ది పోస్టాఫీస్, అచలయతన్ (1912), ముక్తధార (1922), రక్తకారవి (1926) ప్రసిద్ధమైనవి. అతడెన్నో కథా సంకలనాలు వెలయించాడు. గోరా (1910), ఘరెబైరె (1916), ది హోమ్ అండ్ ది వరల్డ్, యోగాయోగ (1929) - అతని ముఖ్య నవలలు. ఇవేగాక సంగీత నాటకాలు, నృత్యనాటికలు, వ్యాసాలు, ప్రయాణ అనుభవాలు, ఆత్మ కథనాలు రచించాడు. చిత్రాలు, పెయింటింగులు, పాటలు, పాటల బాణీలు, ఎన్నో 1941లో తను చనిపోయేదాకా సృష్టిస్తూనే వున్నాడు.

# కాలజ్ఞానం

- వి. అశ్వినికుమార్

మా పిన్ని కూతురు పెళ్ళి. తాటాకు పందిళ్లు ఎండుతున్న పచ్చి వాసన, మామిడి తోరణాలు క్రొత్త వాసాల పచ్చదనాలు, తాటి నార బంధనాలు. ఊరంతటికీ పగలు భోజనాలు. పెళ్లి కొడుకు ఊరు పదహారు మైళ్లు. మా వూరి వంకర డొంక దాటి, కంకర రోడ్డు ఎక్కితే పదిమైళ్లు. ఆ రోడ్డులో ప్రయాణం - అక్కడ చిన్న లాకుల దగ్గర - పంటకాలవ ప్రక్క రోడ్డులో నాలుగుమైళ్లు వెళ్లాలి. బళ్లు కట్టారు. కొత్తగా చెక్కిన వశికర్రలు - ఇరుసులు అప్పుడే ఆముదం రాసుకుని, నారపీచులు చుట్టుకున్న బండి చక్రాలు మెత్తగా తిరుగుతున్నాయి. గూడు కట్టారు - ఎండీ ఎండని ఈతాకు చాపలు మత్తైన వాసన! కింద ఎండుగడ్డి పరుపు- వత్తుగా-మెత్తగా, పైన కంబళి - ఆపైన దుప్పటి. నాలుగు బళ్లు - అప్పుడే దొడ్లోకి వచ్చిన మైసూరు ఎడ్లు సూది కొమ్ములు - సన్న గంటలు. చక చక నడకలు. అప్పటికే దొడ్లో ఉన్న ఒంగోలు గిత్తలు! తెల్లది ఒకటి కర్రిది ఒకటి దర్పంతో మోరలెత్తుకుని పెళ్లి నడకలు-మొద్దు గంటలు- అన్నాలు తిన్నాం-వెన్నెల్లో బళ్లు బయలుదేరాయి. కార్తీకమాసపు చలి- ఎండుగడ్డి వెచ్చదనం- పుచ్చ పూవులాంటి వెలుగు- అయినా బండికో లాంతరు- మసి బారిన ముఖంతో. ''ఏ హేఁహైఁ! ఛో-ఛో! నీ ఎద్దుగూల'' చర్నాకోల ఝుళిపింపు - చవుడు డొంకలో మెత్తగా నడిచిన బళ్లు - కంకర రోడ్డు ఎక్కాయి. ఇనప పట్టాల కింద నలుగుతూ కణుక్ మంటున్న రాళ్లు- ఊళ్లు దాటి, పూళ్లు దాటి - ఆ పెళ్లి ప్రయాణం. తొట్లో కూర్చొని బండి తోలుతూ, ఆ తొట్లో ఒరిగి వెన్నెల్లో తూలుతూ, చుక్కల్ని లెక్క పెడుతూ ఆ తొట్లోనే దుప్పట్లో నిద్రమత్తులో, ఎద్దుల వాసనతో ఎప్పుడు - రెప్పలు చాటున కలల లోకాలు తెరుచుకున్నాయో, సన్నగా కురిసే మంచులో చిన్నగా పరుగులిడే కాలవ నీటితో మెల్లగా సాగే చలిగాలితో వెన్నెల నీడలో, చుక్కల దారిలో, నేలకు నింగికీ చెందిన ప్రకృతి ఒడిలో ఓ భాగంగా, కాలంతో కలిసి సాగిన నా ప్రయాణం! వెలిసిన వెన్నెల - అలసిన గిత్తల ముట్టెల నుండి జాలువారుతున్న నురుగలు నేల రాలుతుండగా - దొండపాడు చేరాం. మున్సబుగారి దొడ్లో పార్కింగ్.

| | |
|---|---|
| కాలం ప్రవహిస్తోంది, పరుగెడుతోంది. | కాలక్షేపం, తృటి కాలం. |
| కాలం గడవటం లేదు! | కాలం కరిగిపోతోంది! కాలాన్ని కుదించాలి! |
| కాల ప్రవాహం! | ఎన్ని పేర్లు - ఎన్ని వివరణలు |
| కాల గర్భం! | ఎన్నెన్ని ఎక్స్‌ప్రెషన్లు! |
| కాల మహిమ! | ఏమిటి ఈ కాలం? |
| కాల పాలన! కాలం వెళ్లబుచ్చటం అనంతకాలం! | ఎలా దీన్ని అర్థం చేసుకోవడం? |

మనం హడావుడిలో ఉన్నాం. తొందర పడుతున్నాం. కాలాన్ని కుదించాలని - తాపత్రయ పడుతున్నాం. అంతా వేగమే. బ్రతుకంతా ఫాస్ట్ ఫార్వర్డ్ అయిపోయింది కదూ! విపరీతమైన రద్దీతో - విసుగు - అసహ్యం పెరిగిపోతోంది కదూ! లిఫ్ట్ తలుపులు ఆలస్యంగా మూసుకుంటున్నట్లు - డోర్ క్లోజర్ నెమ్మదిగా పని చేస్తున్నట్లు అనిపిస్తుంటుంది కదూ! అంతే ఆ పది లక్షణాలు - ఒక రోజులా తోస్తోంది ఎందుకని? ఒక్కసారి ఫోన్ల సంగతి చూడండి. మొదట్లో - ఆపరేటర్ హలో ఏ నంబర్

వి. అశ్వినికుమార్, ప్రెసిడెంట్, పాన్ ఏషియన్ ట్రావెల్ ఏజన్సీ, విజయవాడ.

కావాలి?' తర్వాత డయల్‌ఫోన్లు - అందులో ఒక రకమైన సరసత ఉండేది. పుష్ బటన్ వచ్చిన తర్వాత ఇప్పుడు డయల్ ఫోన్ చూస్తే - ఎంత సేపటికీ తిరగనట్లు అనిపిస్తుంది ఇక స్పీడ్ డయల్ - బటన్స్ - రీ డయల్ - హా స్పీడే స్పీడు!

రిమోట్ లేకుండా టి.వి.ని ఊహించగలమా? టి.వి.లో ప్రకటనలు చూడండి ! వెనక ఎవరో తరుముతున్నట్లు లేదా పిచ్చి కుక్క వెంటబడినట్లు వాళ్లు చెప్పేది వాళ్ళకే తెలియక ఒక దాని మీద ఒకటి, కుప్పలు తెప్పలుగా కప్పల తక్కెడగా - అయిపోతున్నాయి. ఇవ్వాళ వేగం - జీవితాన్ని నిర్దేశిస్తోంది. మిమ్మల్ని కొరడాతో ఛెళ్లున కొట్టినట్లు పరుగులు పెట్టిస్తోంది? అందులోనే - మనకు తెలియని ఒక థ్రిల్ వుంటోంది! వేగంగా పనిచేయగలగటం - మనం ఒక శక్తిగా గుర్తిస్తున్నాం. ఇక్కడే ఒకరితో ఒకరికి పోటీ ఏర్పడుతోంది!! ఒకేసారి ఎన్నో పనులు చేస్తున్నాం ( అవధానులు క్షమించాలి) రేడియో వింటూ, టి.వి. చూస్తూ, పత్రికలు, పుస్తకాలు తిరగేస్తూ మధ్యలో అదీ ఇదీ తింటూ - ఇప్పుడైతే ఇంటర్‌నెట్ బ్రౌజింగ్ చేస్తూ - ఇంతలో సెల్‌ఫోను మోగుతూ- ఇదంతా ఇవ్వాళ సర్వసాధారణ జీవన ధోరణిగా మారిపోయింది. అంటే, ఇప్పటి సాంకేతిక పరిజ్ఞానం మొత్తం - పనులు వేగంగా చేయటానికి, ఒకప్పుడు అలవికానివి, ఎక్కువ పనులు తక్కువ కాలంలో పూర్తి చేయటానికి ఉపయోగ పడుతోంది. ఇప్పుడు తయారయ్యే క్రొత్త క్రొత్త పరికరాలు - కార్‌ఫోన్లు, జిమ్‌లో పుస్తకాల స్టాండులు - షవర్ క్రింద కూడా వినగలిగే హెడ్‌ఫోన్స్ - అల్ట్రా సోనిక్ - ఇన్‌ఫ్రారెడ్ రిమోట్‌లు ఒకటా - రెండా - మిమ్మల్ని తరిమి తరిమి కొట్టడానికి - ఇవన్నీ కొరడాలే! ఒకప్పుడు రేడియో వినటం ఒక్క పనే.

ఇప్పుడు ఆ దృశ్యాన్ని ఊహించగలమా? పోనీ ఎవ్వరైనా అలా కనపడితే మనం వింతగా - చూసినా వింత కాదుకదా? ఇప్పుడు ఏ స్థితికి వచ్చామంటే, చివరికి టి.వి. కూడా మనల్ని కట్టిపడెయ్యలేక పోతోంది. చాలా ఇళ్ళల్లో - టి.వి. వెలుగుతుంటోంది రంగు రంగుల అరబ్బీ దీపంలా? ఆ వెలుగు నీడల్లో - మన పనులు ఆపకుండా చేసుకు పోతున్నాం. విసుగుదలకంటే, వెర్రి తనం మేలని అదే ఎంచుకుంటున్నాం.

మనిషి అడవులలో నుంచి బైట పడినప్పటి నుంచి వేగాన్నే ఎంచుకున్నాడు - జంతువులు - ఆహారానికో, ఆత్మ రక్షణకో వేగాన్ని ఆశ్రయిస్తాయి. అందుకు భిన్నంగా మనిషికి వేగం ఒక వ్యసనంగా మారుతూ వచ్చింది. ఆ వేగం, అతని మేధతో పాటు పెరుగుతూ వచ్చింది. అయితే - సంస్కృతి, సాంకేతిక పరిజ్ఞానం దానికి పదును పెట్టాయి. ముఖ్యంగా ఈనాటి టెక్నాలజి అందించే పరికరాలు కొనగలిగిన స్తోమతున్న సంపన్న దేశాల్లో ఈ వేగం- అంచుల వరకు- 'ఆటోబాన్'లో 'ఫాస్ట్ లేన్'లో వెళ్తోంది. అక్షర జ్ఞానం-సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొలది- మనకు కాల 'జ్ఞానం' కూడా ఎక్కువౌతోంది. కాలాన్ని ఎలా కుదించాలి? ఎక్కువ కాలం ఎలా జీవించాలి? ఇదీ ఇప్పటి ప్రశ్న - లేదా సమస్య !

అసలు ఇదంతా ఎక్కడ మొదలయింది? పాశ్చాత్య యంత్రయుగంతో- వీళ్లు కాలాన్ని 'హోర్డ్' చేసి సొమ్ము చేసుకునే వస్తువుగా చూస్తున్నారు. ఇప్పటి తెలివిగల ''టైం మేనేజర్లు'' ''రోజుకు 48 గంట''లు... ''నీ కాలం నీదే'' ''కాలాన్ని సద్వినియోగం చేసుకో'' ఇలా ఎన్ని పుస్తకాలు, టేపులు, ట్రైనింగ్ క్లాసులు, ప్రోగ్రాంలు- గ్రాఫ్‌లతో మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. మీ కాలాన్ని 'సేవ్' చేసే మిషతో 'ఫాస్ట్‌ఫుడ్స్' 'క్విక్ ప్లేబాక్'లు 'క్విక్ ఫ్రీ జింగ్‌ఫ్రిజ్‌లు' - 'ఫాస్ట్

కూలింగ్ ఎ.సి.'లు - ఇంకా 'క్విక్ క్రెడిట్లు', ఎన్నని చెప్పను? అన్నీ సొమ్ము చేసుకుంటున్నారు.

కాని జరిగేదేమిటి? మీ అప్పులు పెరగటం. రోజుకు 48 గంటల మాయతో, 24 గంటలు నిజ జీవితంలో, ఇవన్నీ నిలబెట్టిన పేక ముక్కల్లా కూలిపోవటం - ఏ పనీ సవ్యంగా జరగకుండా, గందరగోళంలో - మిమ్మల్ని త్రిశంకు స్వర్గంలో వేలాడ దీసి - ఎటూ కదలలేని స్థితికి తెస్తున్నాయి.

ఇప్పటి పరికరాలు అన్నీ కాలాన్ని ఆదా చేయ్యటానికి ఉద్దేశించి - అమ్మబడుతున్నాయి. అంటే ఏమిటి? కాలాన్ని ఆదా చెయ్యటం అంటే - తక్కువ కాలంలో ఎక్కువ పనులు చెయ్యటం. అలా అయితే - బీచ్‌లో కూర్చుని - హాయిగా అలల్ని చూస్తూ - మధ్యలో సెల్‌ఫోన్ మాట్లాడితే - మీ కాలం ఆదా అయినట్లా - వృధా అయినట్లా? సాయిబాబా గుడికి సెల్‌ఫోను తీసుకువెళ్లటం, కార్డియాలిజిస్ట్ దగ్గర్లో - కార్డ్‌లెస్ ఫోను పెట్టుకోవటం, మెడిటేషన్ సెంటర్‌కు మెడికల్ కిట్‌తో చేరటం ఇవన్నీ కాలాన్ని అపహాస్యం చెయ్యటం కాదా?

మీరు రైల్లో ఒక గంటలో పూర్తయ్యే ప్రయాణం చేస్తూ పావు గంట ఓ పుస్తకం చదివారనుకోండి, అదే ప్రయాణం 45 నిమిషాల్లో కారు డ్రైవ్ చేస్తూ పూర్తి చేయగలరు. అంటే రైల్లో గంట ప్రయాణంలో పావుగంటలో పుస్తకం చదివే కాలాన్ని వృధా చేశారా?

వీటికి అంత సులభంగా సమాధానం దొరకదు? ఇంకో విషయం మనవి చేస్తాను - మనం తూర్పున ఉన్నాం కదా? ఆధునిక ప్రపంచంలో - పేద దేశాలకు ముద్దుపేరు, అభివృద్ధి చెందుతున్న దేశాలు! మనం ఇక్కడే వున్నాం కదా! మీరు ఇక్కడి నుండి, ఒక్కసారి అమెరికాలో దిగి, చుట్టూ చూడండి! ఆశ్చర్యం - ఎంత అభివృద్ధి - ఎంత సంపద? మనం ఇక్కడ ఒక వంద సంవత్సరాల తర్వాత కూడా వస్తుందో రాదో అనుకునే 'అభివృద్ధి' అక్కడ కళ్లముందు వుండటం, అందులో మీరు ప్రవేశించడం జరుగుతుంది. అంటే మీరు ఒక వంద సంవత్సరాల కాలం ముందుకు వెళ్ళ గలిగారా? ఈ వింత ఆలోచననే, ''బాక్ టు ఫ్యూచర్'' ఫ్యూచర్ షాక్ లాంటి పదాలతో మనల్ని అదరగొడుతున్నాయి - దూరాలు దాటటానికి, పనులు చెయ్యటానికి, రాత్రి, పగలు అర్థం చేసుకోవటానికి మనం కాలానికి కొలమానం తయారు చేసుకున్నాం - గడియారం ముల్లు తిరగటం మొదలయిన దగ్గర నుంచీ, మనిషి జీవితం ఉరుకులు, పరుగులతో నురగలపాలయింది.

ఐన్‌స్టీన్ మహాశయుడు, ఈ త్రీ డైమెన్షన్ ప్రపంచానికి, నాలుగో డైమన్షన్‌గా 'కాలాన్ని' ఊహించింది, అంతులేని ఈ విశ్వాంతరాళ మర్మాలను, ఆర్ద్రంగా మెరిసే తన నీలి కనులతో దర్శించి, అవగాహన చేసుకునే ప్రయత్నంలో భాగమే కాని, కాలాన్ని వంచాలనో, కుదించాలనో ఆలోచన కాదని నా మనవి? దూరాన్ని అధిగమించవచ్చు - కాలాన్ని దాటటం సాధ్యమా?

* * *

వాషింగ్‌టన్‌లో డా॥ ఇన్నయ్య, కోమల గారి పుత్రుడు రాజు పెళ్ళికి బయలుదేరాను. హైద్రాబాద్ విమానాశ్రయంలో అర్ధరాత్రి, పట్టపగల్లా వెలుతురు. ఎక్స్‌రే మిషన్ల దగ్గర రద్దీ! చెకింగ్ కౌంటర్ల దగ్గర తోపులాటలు, కన్వేయర్ బెల్టుల కటకట మోతలు - ఇమిగ్రేషన్ అధికారుల అనుమానపు చూపులు, కస్టమ్స్ కాపలా దారులు - అన్నిటికీ కుయ్యిమనే మెటల్ డిటెక్టర్స్ - బందుల దొడ్డిలా క్వారంటాన్ లాంజ్ - బోర్డింగ్ కోసం హోర్డింగ్ చెయ్యబడిన జనం - మళ్ళీ తోపులాటలు - రబ్బరు బొమ్మల్లా

- విమానవతులు (పాపం అపరాత్రి డ్యూటి కదా) రో, సీటువెతుక్కొని, హాండ్ బ్యాగ్ లాక్కొని సీటులో కూలబడి, అవులింతలు, ప్రయాణం మొదలవక ముందే - అలసి పోవటం, తర్వాతగంట గాలిలో - రాత్రి మూడు గంటలకు భోజనం! తర్వాత బొంబాయిలో బస్సులు - పెద్ద విమానంలోకి మార్పిడి. మళ్లీ చెకింగ్‌లు, మళ్లీ సెక్యూరిటీలు - రో, సీటు - ఉదయం ఆరున్నరకు - సీటులో కూర్చుని, నిద్రలేచే సమయానికి నిద్రపోవటం - విమానం టర్మినల్ వదిలి, రన్‌వే మీద - నిలబడి - ఒక్కసారిగా త్రాటిల్ వదిలే సరికి 200 కిలోమీటర్ల వేగంతో టేకాఫ్ ముందు ఏదో టెన్షన్ - అయిదంతస్తుల భవనం గాలిలో లేస్తున్నట్టు! ఎయిర్ బోర్న్ తర్వాత తెలియని నిస్సహాయత. ఆప్యాయత లేని ఆతిథ్యం, రోబోట్ల లాంటి - సిబ్బంది. ఒకరితో ఒకరు మాట్లాడుకోని 'తోటి' ప్రయాణీకులు - చెవుల్లో పైపు సంగీతం. రాత్రి - పగలు - రాత్రి అంతా కలగా పులగం - బ్రేక్‌ఫాస్ట్ - లంచ్ - డిన్నర్ - మధ్యలో మత్తు పానీయాలు - అన్నీ ఒక్కటే. టాయిలెట్‌లో ఉడుకలాన్‌లు, బాడికొలోన్‌లు. 33 వేల అడుగుల ఎత్తున - దాదాపు 24 గంటలు కుదించిన వాతావరణంలో పడి ఉండి, పదివేల మైళ్లు నాప్రమేయం లేకుండా, ఆ ఎగిరే బోయింగ్‌లో - ఒక బోల్టులాగా, కన్వేయరు బెల్టుమీద బాగేజీ లాగా న్యూయార్కు కెన్నెడీ ఎయిర్‌పోర్టులో దిగాను - ఇమ్మిగ్రేషన్ క్యూలు - రెండు గంటలు - మన వంతు రాగానే - ''హి! ఎందుకు వచ్చావు? ఎన్ని డాలర్లు వున్నాయి? ఎన్నాళ్లుంటావు? నీ పెళ్లాన్ని తీసుకురాలేదే?'' ప్రశ్నలు -"Oh! Welcome to NewYork! have a nice day?" అంతా యాంత్రికంగానే, కొంత వెకిలితనం కూడా. కస్టమ్స్ కష్టాలు తక్కువే అయినా, ప్రక్క వాళ్ళ పచ్చళ్లు తీసివేస్తూ, - డస్ట్ బిన్‌లో పడేస్తుంటే - పిటి. ఇది సంగతి - !

***  ***  ***

నా మొదటి పెళ్లి ప్రయాణంలో, నేను ప్రకృతిలో - కాలంలో భాగం. రెండో పెళ్లి ప్రయాణంలో ఒక యంత్రంలో బోల్టుని, కన్వేయర్ బెల్టు మీద బాగేజీని. అక్కడనే పోగొట్టుకున్న 'కాలం' వృధా అయ్యిందా? ఇక్కడనే నధిగమించిన 'కాలం' ఆదా అయిందా? అంటే - ప్రాథమికంగా 'కాలాన్ని' అర్థం చేసుకోవటంలోనే - లోపం ఉంది. కాలాన్ని, 'ఆదా' చెయ్యటం అనే తప్పుడు ఆలోచన చుట్టు భ్రమిస్తుంటే, ఇది అవగాహనకు రాదు!

మనకు కొంతకాలం ఉంది, ఆ కాలాన్ని ఆదా చెయ్యటం లేదా, వృధా చెయ్యటం, 'ఉన్న' కాలాన్ని వాడుకోవటం లేదా ఊడగొట్టుకోవటం, 'మిగిలిన' కాలాన్ని నింపుకోవటం, లేదా ఒంపు కోవటం, లాంటి ఆలోచనలు సరికాదు. అసలు విషయం - మనకు ఏదయినా 'ఉంటే' కదా అయిపోయేది. మనకు కాలాన్ని ఎవ్వరూ ఇవ్వలేదు - కాబట్టి, మీరు దాన్ని పోగొట్టు కోలేరు. మనకు 'కాలం' ఎప్పుడూ లేదు. మనం కాలంలో ఉన్నాం. మనం కాలంలో జీవిస్తున్నాం!!

**ముగింపు :**

ఈ వ్యాసం రచించిన ఉద్దేశ్యం, ఆధునిక - సాంకేతిక పరిజ్ఞానాన్ని అవహేళన చెయ్యాలని గాని, ఇప్పటి 'స్పీడు యుగాన్ని' సొమ్ము చేసుకుంటున్న టైం మార్కెటీర్లను కించ పరచాలని కాని, కాదని మనవి, 'కాలాన్ని' మీ నుంచి విడదీసి చూస్తే వస్తున్న ప్రమాదాన్ని సూచించే ప్రయత్నం మాత్రమే!

# నాగార్జునుని 'సుహృల్లేఖ'

(సమీక్షా వ్యాసం)

- డా॥ మలయశ్రీ

ఆచార్య నాగార్జునుడు మహాయాన బౌద్ధాచార్య పరంపరలో 15వ వారు. 13వ ఆచార్యులైన అశ్వఘోషుడు క్రీ.శ. ఒకటవ శతాబ్ది కనిష్క చక్రవర్తి కాలం వారు. అతనికి సుమారు 50, 60 సంవత్సరాల తర్వాత, అంటే - ఒకటవ శతాబ్ది ఉత్తరార్ధంలో లేదా రెండవ శతాబ్ది పూర్వార్ధంలో శ్రీ పర్వతమున జీవించినవాడు ఆచార్య నాగార్జునుడు. ఇతని పేరనే శ్రీపర్వతం నాగార్జున కొండ అని వ్యవహారంలోనికి వచ్చింది. ఇతనికి వందేండ్ల పూర్వం మొదటి నాగార్జునుడు ఉండేవాడు. అతడూ బౌద్ధుడే, కాని, అప్పటికి మహాయాన బౌద్ధం వ్యాప్తిలోనికి రాలేదు. తర్వాత నాలుగైదు వందలేండ్లకు వజ్రయాన నాగార్జునుడు ఉండేవాడు. ఈ ముగ్గురు నాగార్జునులూ ఆంధ్రులు - బౌద్ధులు. మన రెండవ నాగార్జునునికి చాల విలువ ఉండేది. ముఖ్యంగా చీనా టిబెట్‌లలో అతనికి అధిక ప్రచారం ఉంది. మహా పండితుడు, బహుగ్రంథ కర్త అయిన రెండవ నాగార్జునుడు 'మాధ్యమిక వాదం' లేదా 'శూన్యవాదం' స్థాపకుడు. ఆయన రచించిన 'ప్రజ్ఞాపారమిత వ్యాఖ్య' బహుళ వ్యాప్తి పొందింది. మహాయాన బౌద్ధులకు ఆచార్య రెండవ నాగార్జునుని రచనలు పరమ ప్రమాణికం. ఇతని శూన్య వాదమే హిందూ త్రిమతాచార్యులలో ప్రథముడు అద్వైతవాది అయిన ఆదిశంకరాచార్య ప్రతిపాదించిన మాయావాదానికి మూలమని ప్రతీతి; మాధ్యమిక కారికల ప్రేరణతోనే అతని గురువు మాండూక్య కారికలు రచించినాడంటారు. ఆచార్య నాగార్జునుడు శాతవాహన చక్రవర్తుల కాలం వాడు. ధాన్యకటక - అమరావతి స్తూపానికి శిల్పశోభిత ప్రాకారం నిర్మింప జేసినాడు. ఇతడు గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణికి హితోపదేశంగా రచించిపంపిన లేఖా కావ్యాలు రెండు: 1. సుహృల్లేఖ, 2. రత్నావళి.

నాగార్జునాచార్య ఇతర రచనలు ఇవి :

I మాధ్యమిక కారికలు, విగ్రహ వ్యావర్తిని, ఏకశ్లోక శాస్త్రము, ద్వాదశముఖ శాస్త్రము, శూన్యతా సప్తతి.

II వివరణ గ్రంథాలు : ప్రతీత్యసముత్పాద హృదయ శాస్త్రము, యుక్తి షష్ఠిక, బోధిసత్త్వ పాథేయ శాస్త్రము.

III వ్యాఖ్యానములు : మహాప్రజ్ఞా పారమిత టీకా శాస్త్రము, దశభూమి విభాషా శాస్త్రము, భవ సంక్రాంతి శాస్త్రము, ఆర్య ధర్మ ధాతుగర్భ వివరణ, వైదల్య సూత్ర ప్రకరణ.

IV భక్తి స్తోత్రాలు : నిరౌపమ్యస్తవము, లోకాతీత స్తవము, అచింత్యస్తవము, స్తుత్యాతీతస్తవము, పరమార్థస్తవము, ధర్మధాతుస్తవము.

V లేఖాగ్రంథాలు : సుహృల్లేఖ, రత్నావళి.

VI సూత్ర సముచ్చయము - మరికొన్ని అనిర్ధారితాలు.

---

డా॥ మలయశ్రీ, అధ్యక్షులు, నవ్య సాహిత్య పరిషత్, కరీంనగర్.

వీరి రచనలన్నీ సంస్కృత భాషలో ఉన్నవి. ఆదిమ బౌద్ధం పాళీ పాకృతాన్ని ఆదరిస్తే, మహాయానం సంస్కృతాన్ని స్వీకరించింది. సుహృల్లేఖ సంస్కృత మూలప్రతి లభించలేదు. దీని అనువాదం టిబెట్ భాషలో లభిస్తే దానికి మూడు అనువాదాలు ఆంగ్లంలో వచ్చినై. వాటి ఆధారంగా రెండు తెలుగు అనువాదాలు వచ్చినై. నాకు తెలిసినవి ఇవి.

1. వావిలాల సుబ్బారావు - అమరావతి, 1991, వచనానువాదం. 2. గజ్జెల మల్లారెడ్డి, హైదరాబాద్, 1997, పద్య - గేయానువాదం, 'ఆనంద బౌద్ధ విహార' ప్రచురణ. రెంటికీ చక్కని పండిత పీఠికలున్నవి. రచయితల ముందు మాటలు సరేసరి. ఆ రెండు పుస్తకాలే ప్రస్తుతం ఈ నా సమీక్షా వ్యాస రచనకు ఆధారం. కవిత్వం కంటె వచనం మూలానికి దగ్గరగా ఉండే వీలుంటుంది. కాబట్టి మొదటి రచనపై ఎక్కువ ఆధారపడ్డాను. దీనికి రచయిత వ్యాఖ్యానం సైతం ఉంది. అయితే రావుగారు హైందవులు, రెడ్డిగారు కమ్యూనిస్టు. అయినా అనువాదంలో మూలాను సరణ తప్పని సరికదా. ఆ విశ్వాసంతోనే ఈ ''సుహృల్లేఖ'' విశ్లేషణ.

నాగార్జునాచార్యునికి ముందు అశ్వఘోషుడు - 'వజ్రసూచి' పేరుతో ఓ పుస్తకాన్ని కుల వర్ణ విభేదాల - బ్రాహ్మణ ఆభిజాత్యాన్ని ఖండిస్తూ రచించాడు. దానికి నా (మలయశ్రీ) అనువాద పుస్తకం 1997లో మిళింద (టి.రవిచంద్) గుంటూరు ప్రచురణగా వచ్చింది. వజ్రసూచి కేవలం 37 సూత్రాలు, 56 ఉదాహృత శ్లోకాలు కలది. నాగార్జునుని 'సుహృల్లేఖ' 123 ఆర్యావృత్తాలది, చిన్న కావ్యం. అయినా వజ్రసూచికన్నా పెద్దది, అంతే కాదు, కాళిదాసుని 'మేఘ దూతం' కావ్యాని కన్నా పెద్దది, మేఘసందేశం 124 శ్లోకాలదే. ఆ మందాక్రాంత వృత్తాలు పెద్దవి కాబట్టి విషయం ఎక్కువగా వచ్చి పెద్ద రచన అనిపిస్తుంది. సుహృల్లేఖ ఆర్యావృత్యాలది. ఆర్యావృత్తం చిన్న ఛందస్సు. మన కంద పద్యం నడక. భగవద్గీత 'అనుష్టుప్పు' శ్లోకాలు చిన్నవే.

అది ఎందుకో కాని, రావు - రెడ్డి గారల అనువాద పుస్తకాల్లో శ్లోకాల అంకె - సంఖ్య నంబర్లు కలిసినా కొన్ని భావాల భేదం ఉంది. రెడ్డిగారే కొంత స్వేచ్ఛగా రాసినారేమో అనిపించింది. రావుగారి అనువాదం మూలానికి ఎంత విధేయం అనేమాట అటుంచినా, వ్యాఖ్యానం మాత్రం హిందూమత వాసనా భూషితం, అందుకే వ్యాఖ్యజోలికి పోలేదు. నా వ్యాసంలో ఉదహరించిన సుహృల్లేఖ 123 శ్లోకాల అంకెలు సుబ్బారావుగారి అనువాద పుస్తకంలోనివే. భావాలూ అవే.

ఈ 'సుహృలేఖ' ది 'ధమ్మ పదం' నడక. ధమ్మపదం, సుత్తపిటకంలోని ఖుద్ధక నికాయంలోనిది, అది బహుళ ప్రచారంలో ఉన్న బౌద్ధ నీతి కావ్యం, అది పాళీ భాషలో ఉంది. సుహృల్లేఖ ధ్యేయం సైతం అదే హితబోధ. అయినా విషయం వింగడింపులో అంత పకడ్బందీ ప్రణాళిక లేదు. తమిళ 'తిరుక్కురళ్'లో చక్కని ప్రణాళిక ఉంది. కొంత వరకు 'భగవద్గీత'లో ఉంది, అది 'మను స్మృతి'లో కానరాదు. మన శ్రీనాథ కవి, కాశికాఖండ - భీమేశ్వర పురాణాల వంటి ఆశామాషీ రచన సుహృల్లేఖ. విషయం సరే, వివరణే ఒక క్రమంలో లేదు. సరే - విషయానికి వద్దాం.

సుహృల్లేఖలో ఒక వ్యక్తి మంచివాడుగా - (ఒకరాజు) ధర్మ పరిపాలకునిగా మారటానికి కావలసిన ధర్మాలు, చెడుగుణాలతో వచ్చే దుష్ఫలితాలు వర్ణించబడినవి. బౌద్ధ సద్ధర్మ సూక్తుల వివరణ

సరేసరి, తగినంత ఉంది. ఆరంభ శ్లోకం - ''ఓ గుణవంతుడవైన రాజా - బుద్ధ ధర్మాల పుణ్య కాంక్షతో ఈ లేఖ రాసి పంపుతున్నాను 'విను' ఇది నీకు శ్రేయాన్ని సమకూర్చుతుంది'' అని ఉంది. ఆ రాజు పేరు కానీ, ఈ ఆచార్యుని పేరు కానీ ఈ 123 శ్లోకాల్లో ఎక్కడా లేదు.

ఈ శ్లోకాల్లో మన వేమన పద్యాల వలెనే చక్కని దృష్టాంతాలున్నవి. ధమ్మపదం కూడా చక్కగా దృష్టాంతాలను వాడుకున్నది. సుహృల్లేఖ అదే విధానాన్ని అనుసరించింది.

2. చెక్కతో చేసిన జినప్రతిమ పూజింపబడినట్లు ఈ సద్ధర్మ బోధలు చక్కగా నీ మనసులో ఉంచుకో.

3. అమృత సమమైన శాక్యముని బోధలు నీకు సుపరిచితాలే అయినా, సౌధం వెన్నెలలో కన్నులకు విందే కదా! ఈ లేఖ నీ వీనులకు, మనసునకు ఆనందదాయకం అని ధ్వని.

6. సంపద అస్థిరం, డబ్బు యోగ్యులకు దానం చెయ్యాలి, త్యాగ గుణం గొప్పది.

7. సమస్త స్థావర జంగమాలకు భూమి ఆధారమైనట్లు, సకల గుణాలకూ సౌశీల్యం ఆధారం. సుగుణవంతుడవు కమ్ము.

8. త్యాగం, ధర్మం, క్షమ, శక్తి, ఏకాగ్రత, జ్ఞానం - ఈ ఆరు, 'ప్రజ్ఞాపారమిత' షడ్పాత్రాలు (ఆచరించు). 9. తల్లిదండ్రుల-వృద్ధులసేవ (కావించు - తరించు).

113, అష్టాంగ సూత్రాలు - వివరణ.

114, 115, 52 చతురార్య సత్యాల ప్రసక్తి.

16. ధమ్మ పదంలోని 3 లేదా 4వ, గాథల భావం - వైర భావం వద్దని.

10. జీవ హింస, చౌర్యం, కాముకత్వం, అనృతం, మద్యపానం - ఇవి వదలి వేయుము. ఇంకా - భోజనాసక్తి, ఉన్నతాసనాదుల - సుఖ శయ్యల కోసం ఆరాటపడటం, గీత నృత్య మాలికాభరణాదులపై వ్యామోహం విడిచి పెట్టుము. దీనికి రెడ్డిగారి అనువాద పద్యం ఇది -

''హింస రంకు బొంకు ఎత్తై మృదుశయ్య
అల వికాలమందు ఆరగింపు
మద్య చౌర్య నృత్య మాల్యాదులను వీడి
శీల పాలనమ్ము చేయగలవు.

అలవికాలంలో అలవి కాలం, అల వికాలం అక్షరం జరిగెనా రథం బుడిగ్గి, ఆరగింపు, మద్య చౌర్యం కాస్త భావక్లిష్టత స్పష్టం. చేయగలవు కంటె చేయవలయు అర్థవంతం - భారత తిక్కన అయితే చేయు మధిప? అనేవారు. ఈ లేఖా కావ్యంకూడా రాజ సంబోధనముదే.

53 - బౌద్ధంలో 150 శాఖలట, పీఠికలో 18 శాఖలని ఉంది.

17. నీటి మీద, నేలమీద, రాతి మీద చిత్రలేఖనాలవలె భావాలు త్రివిధాలు. 'నీటి రాత నశ్వరం, శిలాశాసనం శాశ్వతం. ఈ లేఖలోని ఈ రెండు భావాలు నీటిమీద వ్రాలు, శిలాశాసనం తెలుగు సంస్కృతం సూక్తులుగా వ్యాప్తిలో ఉన్నవి. దీన్ని తెలుగు జానపదులు' ''ఆడవాళ్ళు అబద్ధమాడితే గోడపెట్టినట్లు, మగవాళ్ళు అబద్ధమాడితే తడక కట్టినట్టు'' అంటున్నారు' నేల మీద రాత మధ్యే మార్గం.

18. ఈ శ్లోకం భర్తృహరికే మార్గం చూపినట్లుంది. మనిషి వాక్కులు - ప్రియం, సత్యం, దుష్టం అని మూడు రకాలట. చివరిది వదలాలి. వాల్మీకి రామాయణంలోనూ ఇలాంటి ఓ శ్లోకముంది. ''సత్యం బ్రూయాత్ - ప్రియం బ్రూయాత్ .....'' అని.

19. వెలుతురు నుంచి వెలుతురుకు, చీకటి నుంచి చీకటికి, వెలుతురు నుంచి చీకటికి, చీకటి నుంచి వెలుతురుకు - పోవడం ఉంటుంది. మొదటిది స్వీకరించు అంటాడు. నిజానికి చివరిదే అవసరం. 'అసతోమా సద్గమయ' శ్లోకంలోని 'తమసోమా జ్యోతిర్గమయ' వలె. ఇంకా - "O God! Lead kindly light" వలె.

ఇక్కడ వ్యాఖ్యాత ''పూర్వ జన్మ పుణ్యం వలన ఇపుడు యోగ్యమైన జన్మను పొంది పుణ్యకార్యాలు చేస్తూ ధర్మమార్గాన్ని అనుసరించడం వల్ల ఉత్తమోత్తమ జన్మనూ తద్వారా ముక్తినీ పొంది తర్వాత బుద్ధులయ్యేవారు మొదటి వర్గం.'' ఇలాగే మరి మూడు, వివరాలు చాలు కదా. ఇది అవగాహన సరిగా లేనిరాత. అయినా మనవాళ్ళు బౌద్ధజైన మందిరాల ఎన్నింటిని కూల్చలేదు. బుద్ధ - వర్ధమాన విగ్రహాలను ఎన్నింటిని హిందూ దేవతలుగా మార్చలేదు. ఇక ఈ రచనలు మార్చడం ఓ లెక్కా.

11,12. కామధాతు, శీలధాతు వర్ణనలున్నవి. ఆ తర్వాత నరక నాకలోక వర్ణన.

74. శ్లోకంలోనూ ఈ పదాల ప్రసక్తి ఉంది. ఇది మనో వశీకరణ మంత్రం వంటిదే! అనొచ్చు.

24. షడింద్రియాలట, పంచేంద్రియాలకు ఒకటి ఎక్కువ. అదిమనసేనో.

22. ఈ అందమైన భావాన్ని చూడండి.

జ్ఞానాన్ని, పుత్రున్ని, నిధిని, ప్రాణాన్ని కాపాడుకున్నట్లుగా చంచలత్వం నుంచి బుద్ధిని కాపాడుకోవాలి. ఇంకా, క్రూర సర్పానికి, విషానికి, శస్త్రానికి, శత్రువులకు, అగ్నికి దూరం జరిగినట్లుగా విషయ వాంఛలకు దూరంగా ఉండాలి, సరి!

29. లాభనష్టాలు, సుఖ దుఃఖాలు, మధుర భాషణ వాక్పారుష్యాలు, దూషణ భూషణలు - ఈ ఎనిమిదింటిపై ధ్యాసను ఉంచవద్దు. ఇందులోని మొదటిది గీతలోని నిష్కామ యోగమే. రెండవది ద్వితీయాధ్యాయం సాంఖ్య యోగంలోని స్థిత ప్రజ్ఞత్వం.

35. పౌరాణిక భావాల వాసనా ఉంది. ఎక్కువ పడగలున్న నాగరాజుకు బాధలెక్కువే.

66. లో ఇంద్రుని ప్రసక్తి వచ్చింది.

వీరిలోకజ్ఞతకు పలు నిదర్శనాలు చూపవచ్చు.

26. కుష్టు వాడు బాధోపశమనానికి అగ్నిని ఆశ్రయించినట్లుగా -

38. ఆహారాన్ని ఔషధంగా స్వీకరించాలి. అతి ఇష్టంగా కాని, అనిష్టంగా కాని తినవద్దు. Live to eat కాక, Eat to Live అన్నట్లే.

39. రాత్రి తొలి-తుది భాగాలు ప్రయోజనకరాలైన కార్యాల్లో గడిపి, మధ్యరాత్రి మనసు పెట్టి నిద్రించితే మంచిది - నిజం.

40. కొద్ది పాటి ఉప్పు గంగాజలం రుచిని మార్చలేదు. కొద్ది పాటి పాప కార్యం అపార సత్కార్యాల ఫలాన్ని కళంక పరుచలేదు. ఇదో దొంగదారి. ఎందుకీ మినహాయింపు? పాపాలు చేయవచ్చు అనేనా! జో బోవోగే వొ పావోగే. ఏది ఎంత చేస్తే, అంత పరిమాణంలో అదే ఫలితం వస్తుంది అనేది హితం - సత్యం. మన వాళ్లు పుణ్యం కోసం కాదు, మోక్షం కోసం కాదు, పాప ప్రక్షాళనకే భక్తిని ఆశ్రయించేది.(మొన్నటి జులై 30-ఆగష్టు 10, గోదావరి పుష్కర స్నానాలకు మన జనం పరుగులు చూశాం కదా!)

49. ఆత్మ నిరసన సరి !

పదినీతులు, పది బూతులు చెప్పక మన దొరలకు నవ్వు పుట్టదు అన్నాడు కవి చౌడప్ప. ఇది అలాంటిది కాదు. ఇది ధర్మనీతి ప్రబోధ లేఖ-రాజుకు. అయినా నవ్వించడం కాదు,నొవ్వు కలిగించినా నీతినే చెప్పాలి. ఈ శృంగార వర్ణన చూడండి.

70. అప్సరో భామినిల వక్షోజాల మీద పొరలినా - ఆ తర్వాత నరకానికే పోతావు, అని వివరణ. ఇది ఆది శంకరుని 'మోహముద్గరం' భజగోవింద గీతంలోని 'నారీ ఘన స్తన నాభీదేశం దృష్ట్వా మాఘా మోహావేశం, భావానికి మాతృక కాదా? ఆ సన్యాసులు - వీతరాగులు, అయినా ఎంతటి శృంగార వర్ణనా నిపుణులో! మొదటి 'అదృశ్యకరణి'తో నాగార్జునాచార్య, చివర 'పరకాయ ప్రవేశ విద్య'తో శంకరాచార్య పరకీయ శృంగారాలకు పూనుకున్న గ్రంథసాంగులేనట. ఆ అద్భుత విద్య లేమిటో, ఆ కథ లేమిటో? ముఖ్యంగా నీతి కావ్యాల్లో ఈ వర్ణనలు అనవసరం. అదీ బౌద్ధ గురువు - సన్యాసి లేఖిని నుండి. ఏమో - 'వాత్స్యాయన కామ సూత్రాలు' రాసిన వాత్స్యాయన ముని బ్రహ్మచారేనట!

అజంతా చిత్రాలు, ఎల్లోరా - అమరావతి - ధూళికట్ట మొ॥ ప్రదేశాల సుందర యువతుల, యక్షమిథునములను రూపొందించిన చిత్రకారులు శిల్పులు సంసారులో సన్యాసులో?!

ఇక ఇక్కడి నుండి నరక వర్ణన. ఇదే ఈ వ్యాసంలోముఖ్యభాగం.

(తరువాయి వచ్చే సంచికలో)

(274వ పేజీ తరువాయి)

శాస్త్రానికి ఉన్న విశిష్ట లక్షణాలను చెప్పాడు: 1) అంతరీకరణం (unteriorisation), 2) ధారావాహికం, 3) స్వైరకల్పనీకరణం (fantasization), 4) చక్రీకరణం (cyclicalisation), 5) పాత్రల, సంఘటనల ప్రతీకీకరణం (allegorisation), 6) అనామీకరణం (anonymisation), 7) కాల స్థితిస్థాపకీ కరణం (elasticisation of time), 8) ఆకాశీ కరణం (spatialisation), 9) శైలీకరణం (stylisation), 10) సద్యః స్ఫూర్తి కల్పనీకరణం (improvisation).

"The stories of our lives become our lives" - Adrienne Ri

జనన మరణాలు తప్పించుకోలేనివైతే, ఆ రెండింటి మధ్య జరిగే జీ వ్యాపారాన్ని ఒక కథ అనుకుంటే, కథలు, కథనాలు మన అస్తిత్వంలో అనుస్యూత ఉంటూనే ఉంటాయి.

కుటుంబంలో, సమాజంలో, మనం నివసించే, పనిచేసే స్థలా మనస్థానాన్ని నిర్వచించుకోవడానికి, జీవితాన్ని అవగాహన చేసుకోవడా ఉబుసుపోకకు, కాలం వెళ్లదీయడానికి, వినోదానికి, ప్రేమలు, వైషమ్యా చెల్లించుకోవడానికి, మనం నిరంతరం కథలను వాడుతూనే ఉంటాం. కథనా మించిన ప్రతీక ఉండదు, మనగురించి.

"... the narrative metaphor professes that persons live th lives by stories - that these stories are shaping of life, and t they have real, not imaginary effects - and that these stori provide the structure of life". - Michael White.

ప్రతి విషయాన్నీ వైజ్ఞానిక పద్ధతిలో అధ్యయనం చేసి, దాని ఆధారసూత్ర నిష్కర్షించి చెప్పాలనే తపన 19వ శతాబ్దంలో బాగా ఊపందుకుంది. పర్యవసాన మానవ శాస్త్రాలు (humanities) అధ్యయన విషయాలుగా వేళ్లానుక విస్తరించాయి.

మనుష్యులు (ఇతర జీవులు కూడా) కమ్యూనికేషన్/సంవాద వ్యవహారం కో ఉపయోగించే నానా మౌఖిక, ఆంగిక, రచనా సాధన సంవిధానాలకు శాస్త్రీ సార్వజనీన, సార్వకాలిక సూత్రాలను కనుగొనే ప్రయత్నంలో ఏర్పడిన సైద్ధాం

ఎక్కడ, ఏ ప్రజ, 'ఏ జాతి, ఏ సంస్కృతి, ఎప్పుడూ కథనం లేకుండ లేదు. అన్ని సమాజాలకు వాటి కథలు వాటి కున్నాయి. వాటిని ఆదరిస్తూనే ఉన్నారు. ఎందుకని? ఎందుకని అంటే మానవ జీవితానికి అర్థాన్ని కల్పించేది కథనమే. కథనం మానవ అనుభవానికి అర్థం చెప్పడానికి కావలసిన 'మూస'లను అందిస్తుంది. మనిషి తన అనుభవాన్ని ఆ మూసలోకి ఇమిడ్చినప్పుడే, అనుభవానికి అర్థం చెప్పుకోకలుగుతాడు. సీతారాముల కథ మంచి అందమైన అబద్ధమే అయినా అది భారతీయ జన జీవితానికి అర్థం చెప్పింది. 'ఏక పత్నీ వ్రతానికి ఒక నమూనాను ఇచ్చింది. ఇప్పటి ఏకపత్నీవ్రతుడు తన అనుభవాన్ని సీతారాముల మూసలో పోసినప్పుడు, దానికి అర్థం ఏర్పడుతుంది. ఇలా కథనాలు అబద్ధాలే అయినా, కాల్పనికాలే అయినా అవి మానవ అనుభవాలకు మూసలనిచ్చి, అర్థాన్ని, వ్యాఖ్యానాన్ని అందిస్తాయి.

కథనం సర్వ వ్యాప్తం. పురాణం (Myth), ఆఖ్యాయిక (legend), కాల్పనిక కథ (fable), పరికథ (tale), చిన్నకథ (short story). వీరచరిత్ర (epic history), విషాద నాటకం (tragedy), హర్ష ప్రధాన నాటకం (comedy), మూకాభినయం (pantomine), చిత్రలేఖనం (painting), మచ్చుల అద్దాల

కిటికీలు, చలన చిత్రాలు, స్థానిక వార్తలు, సంభాషణలు - అన్నింటి లోను కథనం ఉంది. ఈ అనంత రూపాల్లో అది సర్వవ్యాప్తం.

మన ఇతిహాస, పురాణ సాహిత్యంలో కథలు, చరిత్రలు చెప్పుకోవడం గురించిన ప్రస్తావనలు కోకొల్లలు. సాహిత్యం, సంగీతం, చిత్ర, శిల్పకళలు, నాటకం, జానపద కళారూపాలు, సినిమా, చరిత్ర, తత్త్వశాస్త్రం, మానసిక, సామాజిక, వైజ్ఞానిక శాస్త్ర రచనల్లో, తర్క వితర్కాల్లో కథనం వహించే పాత్ర; ప్రసంగాలు, ప్రవచనాలు, ఉపన్యాసాలు, సామాజిక, రాజకీయ రంగాల్లో జరిగే సంవాదాలు, మార్పులు, ప్రక్రియలు; పత్రికలు, ప్రసార మాధ్యమాలు పుంఖానుపుంఖంగా సృష్టిస్తున్న సత్యాసత్య కథనాలు; ఇంటర్‌నెట్ వంటి కొత్త టెక్నాలజీలు, ప్రపంచీకరణం (globalisation) కారణంగా సమాచారం, కథలు, పుకార్లు వ్యాపిస్తున్న తీరు; కథకుడు, రచయిత, రచనలోని పాత్రలు (ఇవి నైరూప్య-abstract-అంశాలు కూడా కావచ్చు), పాఠకుడు/శ్రోత/ప్రేక్షకుడు/వీక్షకుడి దృక్కోణాలు, డాంబికాలు, అధికార వాంఛలు, నైతిక దృష్టి; కథనాల సృష్టి (creation)ని, గ్రాహ్యత (reception)ను, ఆఖరుకు కథన ప్రక్రియలను అధ్యయనం చేసే, సిద్ధాంతీకరించేవారు సృష్టించే కథనాలు, వారి దృక్కోణాలు, స్వార్థాలు, - ఇలా బహు ఆయామాల్లో విస్తరించి సాగుతున్న చర్చలు, అధ్యయనాల సారాంశాన్ని సంక్షిప్తంగానే, తెలుగు పాఠకులకు అందించడానికి 'మిసిమి' ప్రయత్నం చేస్తోంది.

> స్త్ర విషయాల్లో నేటికీ ఒక కొలిక్కి రాకుండా కొనసాగుతున్న వాటిలో - ర్మాణవాదం (structurative), సంజ్ఞాశాస్త్రం (semeiotics), కథన శాస్త్రం rratalogy) ముఖ్యమైనవి. వినిర్మాణ వాదం (deconstruction), ర్మాణానంతర వాదం (post-structuralism), ఆధునికానంతరవాదం (post-dernism) ఇత్యాదిగా బహు చర్చనీయంగా ఉన్న పలు సిద్ధాంతాలకు, తాత్త్విక క్పథాలకు ఆధారభూమిక ఈ శాస్త్రాల వల్లే ఏర్పడింది.
>
> ఒక దృక్కోణం నుండి చూస్తే ప్రాచీనకాలం నుండి ఇప్పటిదాకా వెలసిన అలంకార ర్శనా శాస్త్రాలన్నీ కథన సంవిధానంలోని రహస్యాన్ని, ఆకర్షణను, ప్రమాదాలను గడించి అర్థం చేసుకోవడానికి చేసిన ప్రయత్నాలే. మన దేశీయ సాహిత్య, కళా ప్రదాయాల్లో ఈ అంశం ప్రాముఖ్యం గురించి గొప్ప అవగాహన ఉంది. అంతటి పక్వ దృష్టి ఉన్నా, లేకపోయినా కథల ప్రాముఖ్యాన్ని, అవసరాన్ని గుర్తించని ాజం లేదు.
>
> అయితే 'వాస్తవం - కల్పన' (reality-imagination) ల మధ్య విభేదాన్ని చుల దాకా లాగి చూసే ఆధునిక వైజ్ఞానిక దృష్టి కారణంగా కథనం యొక్క రూప స్వభావాలు గురించిన చర్చ పరమ జటిలమై కూర్చున్నది. అవగాహన గుతున్న కొద్దీ కొంగ్రొత్త రహస్యాలు, సూత్రాలు, సంబంధాలు బహిర్గిత తున్నాయి. వాటివల్ల విలక్షణమైన ఉపయోగాలు, ప్రయోజనాలు సిద్ధిస్తున్నాయి. ది సమాధానాలు, పరిష్కారాలేవీ లేకపోయినా వినూత్నమైన స్పష్టత ్యమవుతోంది.
>
> **- సుమనస్పతి రెడ్డి,** ఆల్ ఇండియా రేడియో, హైదరాబాద్.

బుష్ తన కథనాన్ని చెబుతాడు. ముషారఫ్, వాజపేయిలు తమ కథనాలు చెబుతారు. బిజెపి కథనం బిజెపికి ఉంది. కాంగ్రెస్ కథనం కాంగ్రెస్‌కు ఉంది. ఎవరి కథనాలు వారి కున్నాయి.

కథనమా నీవెవరివి? నేను ఏ కథనాన్ని నమ్మాలి? అడవిలో పడ్డ సూదిని వెతుకుతున్నాను.

(కథనం మీద ఈ వ్యాసం ఆలోచనల కలగూరగంప మాత్రమే)

# మూడవ కన్ను

- వింజనంపాటి రాఘవరావు

'మూడవ కన్ను నెన్నుదుట
మువ్మొన వాలు కరంబు నందు' అంటూ

ఛత్రపతి శివాజీ మహారాజును సాక్షాత్తు శివుని అవతారంగా వర్ణించారు శ్రీ గడియారం వారు తమ 'శివ భారతం'లో.

హైందవ సంస్కృతిలో చాలా మంది దేవీ దేవతలకు ఈ మూడో కన్ను కన్పిస్తుంది. పరమశివునికి కోపం వచ్చి మన్మథుణ్ణి భస్మం చేసింది ఈ మూడో కన్ను తెఱచే. ఎవరికైనా కోపం వస్తే మూడో కన్ను తెఱిచాడు అంటుంటాం. మూడు కన్నులతో బిడ్డ పుట్టినట్లుగా వార్తలలో వినటం మినహా అటువంటి వారు బ్రతికి బట్ట కట్టిన దాఖలాల్లేవు.

మన సంప్రదాయానికి వస్తే ఈ 'మూడో కన్ను ఉంటుంది' అనే చోట వారి వారి మతాచారాల కనుగుణంగా తిలకధారణ చేస్తారు.

అసలింతకీ జంతు ప్రపంచంలో ఏ జంతువైనా మూడు కళ్ళు కలిగి ఉందా? లేక ఇది కేవలం పురాణాల్లోనూ, జానపద కథలలోనూ వర్ణించబడిన అభూత కల్పనా? వివరాలు చూద్దాం.

జీవ ప్రపంచంలో ఒకే కన్ను గల జీవి ఉన్నది. దాని పేరు సైక్లాప్స్ గ్రీకు రాక్షసుడు. సైక్లాప్స్‌కు ఒకే కన్ను. ఈ సైక్లాప్స్ నారి కురుపు వ్యాధిని వ్యాప్తి చేస్తుంది. తేలులో ఎనిమిది కళ్ళున్నాయి. కొన్ని నత్తలలో రెండు వందలకు పైగా కళ్ళున్నాయి. ఇంతకీ సరిగా చూడటానికి ఎన్ని కళ్ళు కావాలి? ఈ ప్రశ్నకు సరియైన సమాధానం లేదు. జీవులు పరిణామ క్రమంలో తమ అవసరాలకు తగినట్లుగా నేత్రాల సంఖ్యను పరిమితం చేసుకున్నాయి.

మరి మనకో, బాగా అభివృద్ధి చెందిన కళ్ళు రెండు ఉన్నప్పటికీ మూడో కన్ను కూడా ఉంది. మనందరికీ మూడో కన్ను ఉందా? ఎక్కడ? అని ముఖం తడుముకోవటమో అద్దంలో చూసుకోవటమో చేయకండి. మీరు ఆశ్చర్య పోనవసరం లేదు. ఇందులో అసత్యం ఏమీ లేదు. ఈ మూడో కన్ను లోపల అంటే మెదడు లోపల దాక్కొని ఉంది. అందుచేత మనకు అద్దంలో కనిపించదు. దీని వివరాలు తర్వాత చూద్దాం.

పురాజీవ శాస్త్రవేత్తలు కొన్ని కోట్ల సంవత్సరాల నాటి జీవుల అస్థి పంజరాలను పరిశీలించే సమయంలో వాటి కపాలాలలో మూడవ కంటికి సంబంధించిన గుంట ఉండటం గమనించారు. ఇది మిగిలిన రెండింటి కంటే కొంచెం చిన్నది. మూడవ కన్ను ఉండటం అనే ఆలోచనే లేని రోజుల్లో ఈ కంటి గుంట విషయమై రకరకాల సిద్ధాంతాలు వచ్చాయి.

వింజనంపాటి రాఘవ రావు, జంతుశాస్త్రోపన్యాసకుడు,
ఆం. ప్ర. గురుకుల జూనియర్ కళాశాల, హిందూపురం - 515 202.

ఓ నూట ఇరవై సంవత్సరాల క్రితం మూడో కన్ను గురించిన సమాచారం తెలియగానే దీని గురించిన పరిశోధనలు ఊపందుకున్నాయి. మూడో కన్ను అన్ని సకశేరుకాలలోను ఉంటుందని గుర్తించారు.

న్యూజిలాండ్‌కు చెందిన 'టాటారా' అనే తొండలో ఈ కన్ను అతి పల్చని పారదర్శకమైన పొరచే కప్పబడి ఉంటుంది. ఈ మూడో కంటితో అది చూడగలుగుతుంది. ఈ టాటారా తొండ జీవించి ఉన్న శిలాజం. అంటే ఎన్నో కోట్ల సంవత్సరాల నుండి దాని శరీర నిర్మాణంలో మార్పు లేదు. బహుశః పురాతన కాలపు జీవులు ఈ మూడో కంటిని ఉపయోగించి ఉండాలని శాస్త్రజ్ఞుల భావన.

అలాగే 'ఇగ్వినా' అనే ఉత్తర అమెరికా ఖండానికి చెందిన తొండలో ఈ కంటి పై ఉండే పొలుసులు పారదర్శకంగా ఉంటాయి. కప్పలలో రెండు కళ్ళ మధ్యలో తెల్లని మచ్చ ఉంటుంది. ఇది మూడో కన్ను తాలుకు మిగిలిన అవశేషం. దీన్ని 'బ్రోస్పాట్' అంటారు.

జీవుల పరిణామ క్రమంలో జీవికి అవసరం లేని అవయవాలు పూర్తిగా క్షీణించి పోతాయి. అవశేషావయవాలుగా మారిపోతాయి. కాని ఈ మూడో కన్ను కొన్ని జంతువులలో కొంత క్షీణించినప్పటికీ, మరి కొన్నింటిలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది ఉంది. దీనిపై శాస్త్రజ్ఞులు పరిశోధించారు.

మానవులలోనూ ఇతర జీవ జాతులలోను ఈ కన్ను ఒక గ్రంథిగా మార్పు చెందింది. కంటి గ్రుడ్డు భాగం పూర్తిగా క్షీణించి, కన్నును మెదడుకు కలిపే భాగం ఒక గ్రంథిగా మారింది. దీనినే 'పీనియల్' గ్రంథి అంటారు. మానవులలో ఇది చాలా చిన్నదిగా 0.1 నుండి 0.2 గ్రాముల బరువు మాత్రమే ఉంటుంది. క్రింది స్థాయి సకశేరుకాలలో ఇది మామూలు కన్ను లాగానే ఉంటుంది. దీనికి ప్రత్యేకమైన నాడి కటకం ఉంటాయి.

పక్షులు, క్షీరదాలు మినహా మిగిలిన జంతువుల నన్నింటినీ శీతల రక్తజంతువులంటారు. అంటే వాతావరణంలో వచ్చే మార్పులను బట్టి వీటి శరీర ఉష్ణోగ్రత ఆధారపడి ఉంటుంది. ఈ జీవులు అతి ఉష్ణాన్నీ, అతి శీతలాన్నీ తట్టుకోలేవు. వాతావరణంలో వచ్చే ఉష్ణోగ్రత మార్పులను కనిపెట్టడానికి ఈ మూడో కన్ను వాటికి తోడ్పడుతుంది. శీతల రక్త జంతువులు ఉష్ణోగ్రతను కొలవటానికి ఉపయోగించే థర్మామీటర్ ఈ మూడో కన్ను.

కప్ప వంటి ఉభయ చరాలలో చర్మం రంగును ఈ మూడో కన్ను నియంత్రిస్తుంది. పీనియల్ గ్రంధి అనబడే ఈ మూడో కంటిని తొలగించిన కప్ప చర్మపు రంగును కొంత మేర కోల్పోతుంది. దీనికి కారణం ఇది స్రవించే మెలటోనిన్ అనే హార్మోను. అంటే మూడో కన్ను హార్మోనులను స్రవించే అంతః స్రావీయ గ్రంధిగా మార్పు చెందిందన్నమాట.

మానవులలో ఇది పూర్తిస్థాయి గ్రంధిగా అభివృద్ధి చెందినా దీనిలో 'ఆస్ట్రోసైట్లు' అనే నాడీ కణాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మూడో కన్ను స్రవించే హార్మోనులు మెదడులోని మరొక భాగంపై పనిచేసి, శరీరంలో నీరు, లవణాల సమతుల్యతను కాపాడటం, రక్తపు సంఘటనను సరి చూడటం, జీర్ణ క్రియ, లైంగిక పరిపక్వతలతో పాటుగా మానసిక ఉద్రేకాలను నియంత్రిస్తుంది. ఈ గ్రంధిని తొలగించిన ఎలుకలు త్వరగా పెరగటంతో పాటుగా త్వరగా లైంగిక పరిపక్వతకు చేరుకున్నాయి. ఎక్కువ సంతానాన్ని ఉత్పత్తి చేశాయి. కోళ్ళలో కూడా గ్రుడ్ల ఉత్పత్తి పీనియల్ గ్రంధి తొలగించడంతో పెరిగింది.

పీనియల్ గ్రంధి స్రావం సరిగా లేని మానవ శిశువులు చాలా ముందుగానే లైంగిక పక్వతకు రావటం, వారి లైంగికావయవాలు మామూలుకన్నా పెద్దవిగా పెరగటం గమనించారు. పీనియల్ గ్రంధి స్రావాన్ని ఇంజెక్షన్ల రూపంలో ఇస్తే ప్రౌఢ జీవుల్లో లైంగికావయవాలు క్షీణిస్తాయి.

మానవులలో ఈ మూడో కన్ను లోపల ఎక్కడో మెదడులో ఉన్నప్పటికీ బయట జరిగే వ్యవహారం నిత్యం దానికి తెలుస్తూనే ఉంటుంది. రాత్రింబవళ్ళను స్పష్టంగా గుర్తించగలుగుతుంది. వెలుతురు చీకట్లు దీనిపై ప్రభావం చూపిస్తాయని గుర్తించారు. రోజుల తరబడి వెలుగులో ఉన్న జీవులలో ఈ గ్రంధి క్షీణిస్తుంది. అధికంగా గ్రుడ్ల ఉత్పత్తి సాధించటానికి కోళ్ళ ఫారాలలో రాత్రిళ్ళు కూడా వెలుగు ఉండేలా చూడటం అందరికీ తెలిసిందే.

ఈ పీనియల్ గ్రంధి అనబడే మూడవ కన్ను ఉత్పత్తి చేసే స్రావ ప్రభావం ఇతర హార్మోన్లు ఉత్పత్తి చేసే గ్రంధులపై ఉంటుంది. ఈ గ్రంధి చేసే పని వయస్సుతో మారుతుందని గమనించారు. ఓ వయస్సు దాటిన తర్వాత దీనిలో కాల్షియం లవణాలు చేరటం గమనించారు.

'కంటిలోని నలుసు - కాలిముల్లు' భరించరానివి.

కాని ఈ కంట్లో చేరిన కాల్షియం లవణాలు ఈ గ్రంధిపై పెద్దగా ప్రభావం చూపిస్తున్నట్లు లేదు. ఈ మూడో కన్నును గుర్తించిన తర్వాత ఎన్నో విషయాలు తెలుసుకున్నా, ఇంకా తెలుసుకోవలసినది చాలా ఉంది. అందుకే ఉపనిషత్తుల్లో

'విజ్ఞానం బ్రహ్మేతి విజానాత్'

అంటే విజ్ఞానము బ్రహ్మము వలె అనంతమైనది అన్నారు.

*(''ఆకాశవాణి, విజయవాడ కేంద్రం, ఉదయ రేఖలు కార్యక్రమంలో సైన్సు వీధి శీర్షిక క్రింద ప్రసారం చేయబడింది''.)*

# ఆత్మలో స్థాపితమైన రమణ మహర్షి

- డాక్టర్ దేవరాజు మహారాజు

రమణ మహర్షి తన పదిహేడవ యేట అన్ని బంధాలను వదిలి 1897లో అరుణాచలం చేరాడు. 1950 వరకు ఆ పర్వతపు వెలుగులో ఐక్యమయ్యే వరకు అక్కడి నుండి కదల లేదు. అరుణాచల పర్వతం, రమణ మహర్షి ఒకే సత్యాన్ని తెలియజేశారు. పర్వతం లాగానే మహర్షి కూడా జీవితాంతం నిశ్శబ్దాన్ని, శాంతిని కాంక్షిస్తూ చలన రహిత స్థితిలో ఉన్నాడు. పర్వతం నేలలో స్థాపితమైనట్లే మహర్షి ఆత్మలో స్థాపిత మయ్యాడు. పర్వతపు నిశ్శబ్దం లాగానే ఆయన మౌన భాషణతోనే మానవాళికి సందేశమందించాడు. అరుణాచల పర్వతమూ, దానికింద స్కందాశ్రమంలో జీవించిన రమణ మహర్షీ రూపం లేని ఆత్మ ధరించిన రెండు రూపాల వంటి వారని అంటారు.

పర్వతం చుట్టూ ప్రదక్షిణం చేయడం, వీలున్నప్పుడు వంట చేయడం, భక్తులను కలుసుకోవడం రమణ మహర్షి దిన చర్యల్లో ముఖ్యాంశాలు. క్రమ క్రమంగా ఆశ్రమం తయారైంది. వచ్చిన భక్తులందరికీ అక్కడ భోజన సౌకర్యం ఉండేది. ఆశ్రమ నిర్వహణ రమణ మహర్షి తమ్ముడు చిన్న స్వామి చూసుకునే వాడు. వచ్చిన భక్తులకు కాఫీ అందనిదే రమణ మహర్షి కాఫీ తాగే వాడు కాదు. ఆధునిక యుగంలో ఋషిలా బతకడం ఎంతో కష్టం. అంతటి కష్టకార్యాన్ని ఆయన అవలీలగా చేసి చూపాడు. మొలకు కౌపీనం తప్ప వొంటి మీద మరో నూలు పోగు ఉండేది కాదు. ఆ గుడ్డయినా చినిగి పోతే తనకు మరో గుడ్డ కావాలని ఆయన ఎప్పుడూ ఎవరితోనూ నోరు విడిచి చెప్పలేదు. తుమ్మ ముల్లుకు బెజ్జం చేసి, దానిలోకి దారం ఎక్కించి కుట్టుకునే వాడు. స్నానానికి వాడే తుండు గుడ్డ వంద చిరుగులదైనా పడేసే వాడు కాడు. శిష్యులే తమ తప్పిదం తెలుసుకుని కొత్తతుండు తెచ్చేవారు.

'ముల్లుతో కుట్టిన కౌపీనం ధరించిన ఓ వేంకట రమణా
వేయి కళ్ళ ఇంద్రుడే నీకు తువ్వాలై సేవ చేశాడయ్యా!' - అంటూ

ఓ భక్తుడు పద్యం రాశాడందుకే. భక్తులు వెండి కప్పూ, సాసరూ ఇచ్చి వెళితే ఆయన వాడే వాడు కాదు. ''అవి మనకెందుకు శ్రేష్ఠమైన కొబ్బరి చిప్పలుండగా'' - అనేవాడు. జాతులకు, మతాలకు, రాగద్వేషాలకు అతీతంగా బతికాడు రమణ మహర్షి. దేశ విదేశాల నుండి భక్తులు తండోప తండాలుగా వచ్చేవారు. ఆయన్ని 'భగవాన్' అని పిలిచేవారు. ఆయనకు ప్రదక్షిణలు చేసేవారు. కానీ ఆయన వారిని వారించే వాడు. ''మీ మనసుల్ని మీరు నిగ్రహించుకోండి, అది ముఖ్యం. అది చేయకుండా నాకు నమస్కరిస్తే ఏమొస్తుంది?'' - అనేవాడు.

యస్. యస్. కొహెన్, ఆర్థర్ ఆస్‌బోర్న్, మేజర్ చాడ్విక్, పాల్ బ్రంటన్, ఫ్రాంక్. హెచ్. హంఫ్రీస్

---

డా॥ దేవరాజు మహారాజు, కవి, రచయిత, ఉద్యోగరీత్యా అసోసియేట్ ప్రొఫెసర్, హైదరాబాదు.

వంటి విదేశీయులు. శివప్రకాశం పిళ్లై, కావ్యకంఠ గణపతి శాస్త్రి, శ్రీమతి సూరి నాగమ్మ, ఓరుగంటి కృష్ణయ్య, సాధు త్రివేణి స్వామి, శ్రీమతి వారణాసి సుబ్బలక్ష్మమ్మ, ఎం.జి. షణ్ముగం, బలరామిరెడ్డి, ఎచ్చమ్మాళ్, ప్రబుద్ధానంత సన్యాసి, డాక్టర్ కృష్ణమూర్తి అయ్యర్, గౌరి అమ్మాళ్ వంటి ఎంతో మంది స్వదేశీ భక్తుల అనుభవాల్లోంచి రమణ మహర్షి జీవన రేఖలు వెలుగులోకి వచ్చాయి. ఎక్కువ కాలం మౌన ముద్రలో వుండే మహర్షి ఎవరితోనూ తన జీవిత విశేషాలు చెప్పుకోలేదు. ఏ ధార్మిక మహా సభల్లోనూ ఉపన్యసించలేదు. ప్రసిద్ధ తెలుగు రచయిత గుడిపాటి వెంకటాచలం తన చివరి రోజులు రమణాశ్రమంలో గడిపాడు. ఎంతో మంది ముస్లిం మతస్థులు కూడా ఆయనకు భక్తులయ్యారు. హైదరాబాదు వాసి, రాజకీయ నాయకుడు, 'నూతన విద్యా సమితి' పేర విద్యా సంస్థలు నెలకొల్పిన డాక్టర్ మేల్కొటే కూడా ఆయన భక్తుల్లో ఒకడు. రమణ మహర్షి గురించి ప్రపంచానికి మొదట తెలియజేసినవారు ముగ్గురు. ఒకడు శివప్రకాశం పిళ్లై. బహుశా ఈయనే మొదటి భక్తుడు. రెండవ వాడు ఫ్రాంక్ హెచ్ హంఫ్రీస్. ఈయన దక్షిణ భారతంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఉండేవాడు. ఈ బ్రిటిష్ అధికారి తన తెలుగు ట్యూటర్ నరసింహయ్య ద్వారా రమణ మహర్షి గురించి తెలుసుకుని ఆయన వద్దకు వెళ్ళాడు. ఇక మూడో వాడు పాల్ బ్రంటన్. ఈయన 'ఎ సర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా'' అనే పుస్తకం రాసి రమణ మహర్షిని ప్రపంచానికి పరిచయం చేశాడు.

1879 డిసెంబర్ 30న తమిళనాడులోని మధురై పట్టణానికి దగ్గరలో తిరుచ్చుళి అనే గ్రామంలో పుట్టిన వెంకట రామన్, రమణగా, రమణ మహర్షిగా, భగవాన్ రమణగా ప్రపంచ ప్రసిద్ధుడై 1950 ఏప్రిల్ 14న తన 71వ యేట తనువు చాలించాడు. ఈయన తండ్రి సుందరం అయ్యర్. తల్లి అలగమ్మాళ్. ఇవి ఊరికే మనం తెలుసుకోవల్సిన విషయాలు. నిజానికి చావు పుటకలకు అతీతంగా ఎదిగిన రమణ మహర్షి బోధనల్ని అర్థం చేసుకోవాలంటే ఒక రకమైన స్థాయి అవసరం.

తమకు తాము ''నేనెవరు?'' అని ప్రశ్నించుకోమంటాడు రమణ మహర్షి. ఆత్మ దర్శనం చేసుకోమంటాడు. ఒకసారి ఆయన ఇలా అన్నాడు: ''నేనెవరూ? అని చివరంటా ప్రశ్నించుకుంటూ వెళితే ఆలోచనలన్నీ నశిస్తాయి. శవదహన సమయాన నలువైపులా నిప్పు రాజుకోవడానికి కట్టెల్ని కదిలించే కర్రముక్క చివరకు ఆ అగ్గికి ఆహుతి అయినట్టు ఈ నేనెవరు? అనే ప్రశ్న కూడా దగ్ధమై, ఆత్మ దర్శన మిస్తుంది'' అని. మరోసారి ఆయన 'ఆలోచన' గురించి అద్భుతంగా చెప్పాడు. ''ఏ ఆలోచన లేకుండా నిశ్శబ్దంగా ఉండడమే సంపూర్ణత్వం. ఆలోచనలు లేకుండా ఉండడమే నిష్ఠ. ఆలోచనలు లేకుండా ఉండడమే జ్ఞానం. ఆలోచనలు లేకుండా ఉండడమే మోక్షం. ఆలోచనలు లేకుండా ఉండడమే సహజం. అందువల్ల ఆలోచన లేకుండా ఉండడమే అంతిమ పూర్ణత్వం'' - ఈ విధంగా ఆర్బాటం లేని ఆత్మ విచారణ చేసుకోమన్నాడాయన. మరోసారి మరో మాట చెప్పాడు. ''ఎవరి ఉద్దేశాలు వారివి. అవి నెరవేరుతూ ఉండొచ్చు కూడాను. నీ ఉద్దేశమేమిటో చూచుకుని,

అది నెరవేరేట్లు చేసుకోరాదా? ఇతర్ల ఉద్దేశాలతో నీకేమి పని?'' - ఇది ఈ కాలం వారికి కూడా పనికొచ్చే మాట. అభిప్రాయ భేదాల పేరుతో మనస్పర్థలు పెంచుకుని దూరమవడం అనవసరం. ఒకసారి ఆయన గురువు గురించి చెప్పాడు. ''గురువు నీలో ఉన్నాడు, వెలుపల కాదు. నీలో ఆత్మరూపంలో ఉన్న గురువే తర్వాత కాలంలో మానవ రూపాన గురువుగా తారసిల్లుతాడు''.

రమణ మహర్షిని భగవాన్‌గా భావించి ఆయన నామ సంకీర్తనం చేసే వారికి ఒక విచిత్రం కనిపించేది. ఆయన కూడా సంకీర్తనంలో పాల్గొని రమణ నామం ఉచ్చరిస్తూ అమాయకంగా అందులో భాగస్వామి అయ్యేవాడు. తను దేహమని కాని, తానే ఆ పేరుగల వాణ్ణని గాని, ఆయన ఎప్పుడో విస్మరించాడు. ''మనిషి అంతర్ముఖుడు అవడం ప్రధానం. అలా అంతర్ముఖుడైన వాడికి శాస్త్రాలతో పనిలేదు. అవన్నీ మిగతా వారికే'' - అని చెప్పగలిగాడు. ఆయన స్త్రీ, పురుషులతో, వివిధ మతాల వారితో, వివిధ జాతుల వారితో సంభాషించేవాడు. ఏదో కొద్దిగా మాత్రమే రాసేవాడు. మొత్తం మీద మహా మౌనంలో జీవితం గడిపాడు. ఆయన మౌనాన్ని అర్థం చేసుకునే వారికి అదే బోధగా అనిపిస్తూ ఉండేది. ఆయన జీవించే తీరు, మనుషులతో వ్యవహరించే విధానం, ఆత్మావలోకనం చేసుకునే పద్ధతి శిష్యులకు, భక్తులకు ఒక గుణపాఠంగా ఉండేది.

అన్నీ ఆ భగవంతునికి తెలుసు. అన్నీ అతడే చేయిస్తున్నాడు - అని సామాన్య ప్రజలు- అభిప్రాయ పడుతుండగా రమణ మహర్షి అందుకు విరుద్ధంగా ''భగవంతుడికి ఈ ప్రపంచం గురించి, ప్రపంచంలోని జీవరాసుల గురించి ఒక అభిప్రాయమంటూ లేదు'' అని చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు ''సూర్యుడు ఏ కోరికా ఏ ప్రయాసా లేకుండా ఉదయిస్తాడు. తన వెలుగు కిరణాలతో ప్రపంచంలో ఎన్ని పనులు జరుగుతున్నాయో అతనికి పట్టదు. అలాగే మోక్ష ప్రాప్తి కోసం జీవులు చేసే చర్యలతో అతడికి ఏ సంబంధమూ లేదు. మనుషులు తమతమ చర్యలద్వారా భగవంతుడేర్పరిచిన ధర్మసూత్రాల ననుసరించి ఫలితాలు పొందుతుంటారు. బాధ్యత మనుషులదే కాని భగవంతుడిది కాదు'' - అని.

చేసే తప్పిదాలన్నీ చేసి, భారం దేవుడి మీద వేసే భక్త కోటి భ్రమల్ని రమణ మహర్షి పటాపంచలు చేశాడు. ఈ విషయమై ఆయన తన అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చాడు. ''కకావికపు జీవితం గడిపి పూజిస్తే ఆ దేవుడు రక్షిస్తాడని గానీ, మతాలు, వాటి ప్రతినిధులు రక్షిస్తారని గానీ అనుకోవడం శుద్ధ పొరపాటు. మీ కాళ్ళ మీద మీరు నిలబడండి. మీ జీవితానికి మీరు సంపూర్ణ బాధ్యత వహించండి. ఆత్మ విచారణతో మీరెవరో కనుక్కోండి. అదే మీ ప్రవర్తనను సరిదిద్దుతుంది'' - అని. చదవడం, రాయడం పెద్దగా తెలియక పోయినా, అంతర్ముఖుడై, ఆత్మావలోకనం చేసుకుని, తాను చవి చూసిన సత్యాల్ని లోకానికి వెల్లడించాడు రమణ మహర్షి! లోతుగా తరచి చూస్తే ఆయనలో ఒక యోగి, ఒక సామాజిక కార్యకర్త, ఒక హేతువాది, ఒక భక్తుడు కలగలిపి కనిపిస్తారు.

# సమసమాజం గురించి

- డా॥ సర్దేశాయి తిరుమలరావు

(గత సంచిక తరువాయి)

**ఇక ఉన్నవ రచన 'మాలపల్లి'లోని తక్కెళ్ళపల్లి జగ్గని ప్రణాళికను చూస్తాము (బుర్రకథ)**

రామరామ శ్రీరామా రామా - రామారఘురామా
తక్కెళ్లజగ్గని ధర్మబోధలు తలపున నిలుపండి
ఆదికాలమున అందరు జనులు అన్నదమ్ములండి
నదులు ఎనంబులు నానామృగములు నాల్గుసంద్రములు
కొండలు తండలు జలములు పొలములు కుంటలు సెలయేళ్లు
కాయలు పండ్లు పాడిపంటలు ఘనమయినా నాయిండ్లు
అంతరువులా భేదములేక అందరి సొమ్మండి
కుడవాగట్టా వొకరికి బెట్టా కొదవాలేదండి
నానీ భేదములేక లోకము నడుస్తూవుండేది
మనసు లోపలా చీకు చింతలు మందుకైన లేవు
తొత్తుల దొరల భేదములేని తోడుబంటులండి
అందలమెక్కి మోసే భేదములసలేవండి
ధనికుల పేదల తారతమ్యముల్ తలలు జూపలేదు
అరకువ ఆకలి భాధలప్పుడు అంకురించలేదు
ధనమును గొల్చేదుష్టరోజులు దాపరించలేదు
తిరిపెము కొర్కై ధనికుల బీదలు దేవిరించలేదు.
కూటికి గుడ్డకు గుట్టికుంటలు గోడుచెందలేదు
మాపులు రేపులు మలమలమాడుచు సూలలెండలేదు
భోగ్యములొక్కట పస్తులొక్కట పొందియుండలేదు
దొరలు మత్తులై నీచభోగముల దొర్లుతుండలేదు
పాటుపడడమే పరువు తక్కువను భ్రాంతిలో పడలేదు
రామరామ ............................ ఘురామా
తక్కెళ్లజగ్గని ........................ నిలపండి.
కృతయుగమందలి ధర్మములెల్ల క్రింది మీదుగాక
పాపముతోటి కలియుగమంత పండిపోయెనండి
పాపధర్మములు లోకమంతట పరిసిపోయెనండి
యెక్కడ జూచిన ఆర్భాటములె యెక్కడ ఘోషములె

---

కీ॥ శే॥ డా॥ సర్దేశాయి తిరుమలరావు, ప్రముఖ సాహిత్య విమర్శకులు, (1928 - 1994)

యెక్కడ చూచిన పోటీలండి యెక్కడ కలవరమె
సన్మార్గంబున జీవయాత్రలు సలుపుట దుర్ఘటము
లోకమందున చక్రవర్తియై లోభుడేలుచుండు
లోకమునందలి ద్రవ్యమంతయు లోభులపరమయ్యె
అంతానాదే అంతానాదే అందురు జనులండి
అంతా మనదేయనెడి రోజులు అంతరించెనండి
పరువిడుకాకులు యిండ్లమీదుగా పారవెరచుచుండు
యెంగిలి చేయీ కాకులవైపు విసరదు యిల్లాలు
నారాయణమ్మలు యిల్లెయంటు నడుతురు యింటింట
యెవరో కొందరు అరుపుకొందురు యెల్లద్రవ్యములను
కోటికొక్కరైవున్నారండి కోటీశ్వరుడంటు
కుచేలులందరు అయినారండి కోట్లకొలదిగాను
కోటీశ్వరులకు నిష్టిబిడ్డలు కోట్లకు కర్తలట
మనుమలెాదూ మనంతరాలూ మారుహక్కులంట
అరువు జెప్పితె అడ్డుగకూలి పనికి ఫాతికెంట
రామరామ ........................ రఘురామా
తక్కోళ్ల జగ్గని ధర్మపన్నముల్ తలచిబ్రతుకరండి
ధనికులు బొర్రలు నింపుకొందురు తలవరొకరిబాగు
చేతుల వెళ్ళపనులు ముట్టక చెడి సోమరులైరి
కాలిమీదనె కాలువేసుకొని కాలం బుచ్చేరు
భాగ్యవంతులకు బీదలెల్లరు బానిసలైనారు
పొద్దుగూకులు చాకిరిచేస్తురు బొక్కెడికూటికిగా
యెంతచేసినా తృప్తిలేదయా యజమానులకెల్ల
రోగంరానీ నొప్పిరానీ నాగాదప్పదయా
కూలికి విలువగలదని మీరు గుట్టుదెలుసుకొండి
కూలికి దగిన విలువ బుచ్చుకొనే కూలికి మరిపోండి
నీళ్ళ కూలికి వొప్పుకుంటిరా నెనరు జెరుపుకొంద్రు
పనివాండ్లందరు యేకమైతిరా ప్రపంచమె మీది
ఐకమత్యమె అన్నిపనులకు ఆధారమండి
శ్రేణులు గట్టి సమ్మెగట్టితే చెల్లును మీమాట
కొట్టావద్దు తిట్టావద్దు కోర్కెలు నిడివేరున్

అసహాయ యోగము తరుణముజూచి అవలంభించండి
దానికి మిగిలిన మంత్ర తంత్రముల్ ధరలో లేవండి
శంకలుదక్కి మీరెల్లరు శపథము జేయండి
సమతాధర్మం ప్రపంచమందున స్థాపింతురుగాని
కృతయుగ ధర్మంలోకమంతటా కుదుటబెట్టగలరు
రామరామ ............................... రఘురామా

ఇందులో మహాభారతంలోని భావాలు, చారిత్రక భౌతికవాదం (Historical materialism), మార్క్స్ Surplus value of labour, కమ్యూనిస్టు మేనిఫెస్టోలోని Working men of the world, unite మొదలైన అంశాలున్నాయి.

ఇంతకన్నా స్పష్టంగా వెంకటదాసు, వురవు జగ్గని విచారణలో ఉన్నవ, ప్రణాళికను విశదీకరిస్తాడు. ఇప్పుడు ''మాలపల్లి'' నుండి పూర్తిపాఠం ఇస్తున్నాను. కోర్టువారికి, జగ్గనికి సంవాద మిది. ఇందులో జగ్గని వాఙ్మూలం సోక్రటీసు న్యాయమూర్తులను ఎద్దేవా చేస్తూ చేసిన Apology *వలెనూ, గోర్కీ

* సోక్రటీసు వాఙ్మూలం :

I will begin at the beginning and ask what is the accusation, which has given rise to the Slander at me .... For I do nothing but go about persuading you all, old and young alike, not to take thought from your persons or your properties, but first and chiefly to care about the greatest improvement of the Soul. I tell you that virtue is not given by money, but for the virtue comes money and every good of man, public as well as private ..... there seems to be something wrong in asking a favour of judge .... for his duty is not to make a present of justice, but to give judgement ..... For I do believe there are gods in a sense higher than that in which any of my accusers believe in them ..... I would rather die having spoken after my manner than speak in your manner and live ..... The difficulty, my friends, is not to avoid death but to avoid unrighteousness. .... I prophesy to you my murderers, that immediately after my departure, punishment far heavier than you have inflicted on me will surely await you..... the noblest way is not to disabling others but to be improving yourselves. Hitherto, the divine faculty of which the internal oracle is the source has constantly been in a habit of opposing me even about trifles, if I was going to make a slip or error in my matter.

We go our ways - I to die and you to live

Socrates' Apology - Dialogues of Plato

"అమ్మ" (1907) అనే నవలలో పావెల్ కోర్టువారి ఎదుట ఇచ్చిన స్టేట్‌మెంట్ వలెనూ ★. 1970లలో శ్రీలంకలో, విచారణ సంఘం ఎదుట విప్లవవాది రోహణ విజయవీర ఇచ్చిన వాఙ్మూలం వలెనూ అన్ని కాలాలోనూ ప్రతిధ్వనించేదిగా ఉంది. ఇకమూలం అనుసరిస్తాము.

'వెం : వెంకటదాసే నాపేరు. మధ్య వచ్చిన పేరు మధ్యనే పోనియ్యండి - ఆలోచించుకుంటే నా చరిత్ర యావత్తూ లోకానికి రజ్జుసర్పభ్రాంతిగా ఉండకపోదు.

కో : వేదాంతివి కూడానా ?

వెం : వేదాలను అంతమొందించేవాడని ఆమాట అర్థమిచ్చేటట్టయితే వేదాంతినే

కో : వేదాలనే అంతం చేస్తావా ?

వెం : లోకకంటకములయిన ధర్మాలందులో ఉంటేవాటిని.

కో : సాక్ష్యమంతా విన్నావుకదా, ఏమి చెపుతావు ?

వెం : సాక్ష్యమంతా నిజమే. కొన్ని కొత్త సంగతులు చెప్పుకోవలసి ఉన్నవి. ఉత్తరువు దయచేయిస్తే చెబుతాను.

---

★పావెల్ వాఙ్మూలం :

"We are socialists. That means we are against private property, an institution which dieintegrates society, sets people against one another, creates an irreconcilable hostility of interest, resorts to falsehood in the effort to conceal or justify this hostility, and corrupts all people with his hypocricy and hatred ..... our slogans are simple enough ...... "Down with private property", No one exempt from work" ... The cost of defending private property is too high .... Your energy is the mechanical energy of multiplying gold, it splits into groups meant to gobble each other up. Our energy lies in the vital and every-increasing consciousness of the solidarity of all working people. You have torn man away from life and destroyed him. Socialism will take the world you have destroyed and rebuild it into one great whole and nothing you can do will stop it. I've almost finished..... I almost sympathised with you. After all you are human beings."

"Mother" by Maxim Gorky.

కో : దేనిని గురించి ?

వెం : ఫిర్యాదీ, ఇండియా చక్రవర్తి నేజేసినవి దొంగతనాలంటాడు. నేకాదంటాను. ఆసందర్భంలో నే జెప్పేది సాకల్యంగా వ్రాసుకోవలసిందని నా కోరిక.

కో : చెప్పుకోవచ్చు. యావత్తూ వ్రాస్తాను.

వెం : సృష్ట్యాదిన హక్కు-స్వత్వాలు లేవు. జనులు సోదర భావంతో భూదేవి యిచ్చిన పంటను అశ్వస్తనిక భావంతో అందరూ అనుభవిస్తూ ఉండేవారు. గ్రామంలో నిలువచేసిన ధాన్యాల పాతళ్లు, గాదెలు, కొట్లు గ్రామ సంఘాలు గ్రామ సమూహమున్నకై ఉపయోగిస్తూ వుండే వాండ్లు. జనులందరికీ సంఘసేవదప్ప రెండవ సేవలేదు. ఆహారపదర్థాలే ద్రవ్యం. ధనకాంక్షపుట్టలేదు. వెండి, బంగారు పెంకుల కింకా విలువలేదు. అహోరాత్రాలు వాటిని కాపాడే కాలంకాదు. అంతాపని చేసుకుండే వాండ్లు. ఆరోగ్యవంతులై అనుభవించేవాండ్లు. ఆరోజులలో సంపాదన అనుభవించడంకోసం గాని దాచుకొని కాపాడడంకోసం గాదు. మనసుకు తృప్తివుండేది. వ్యాకులమూ, తొందరా, పోటీలు లేవు. నిర్మలమనస్కులై ఆనందమనుభవిస్తూ వుండే వాండ్లు. అందరూ భాగ్యవంతులే దారిద్ర్యమేలేదు. స్వర్గం భూమి మీదనే ఉండేది. ఇట్లావుండగా ఈశ్వరుడు వచ్చి ప్రపంచమంతా నాదన్నాడు. నేనుగొప్ప వాడిని గనుకనాకు మీరంతా సేవచెయ్యండన్నాడు. తనకు మేడలు కట్టమన్నాడు. తను రథమెక్కించి మొయ్యమన్నాడు. ఈశ్వరుడి ఐశ్వర్యంచూచి చిన్న దేవుళ్లు బయలుదేరారు. త్రిమూర్తులమన్నారు, దిక్పాలకులమన్నారు, చివరకు మా గణితం ముప్పైమూడు కోట్లన్నారు. ఇంకా పెరిగింది. గ్రామ దేవతలూ, గృహదేవతలు కూడా పుట్టారు. జనుల సంఖ్యకంటే దేవతల సంఖ్య ఎక్కువైంది. కొలుపులు సాగినవి. వీండ్లను జూచి కొందరు జనులకు కూడా నోళ్లూరినవి. గురువులు భూదేవతల మని బయలు దేరారు. పుడమి దయ్యాలై ఐశ్వర్యవంతులు పుట్టారు. యథాశక్తిగా దేశాలు, గ్రామాలూ, క్షేత్రాలు, ధనధాన్యాలు ఆక్రమించుకొన్నారు. మనుష్యులను బానిసలు చేసి., పశుత్వమిచ్చి వారి మీదసైతం స్వామ్యం సంపాదించారు. పోటీదారులెక్కువగావడం చేత గావాలె, ఈశ్వరుడు స్వర్గాన్ని హరించి భూమిమీదనుంచి యెత్తుకొనిపోయి యెక్కడనో పెట్టుకున్నాడు. స్వర్గం భూదేవతలకూ, ధనికులకు కూడా దూరమే అయ్యింది. ఎవ్వరైనా అక్కడికడుగు పెట్టగలరుగాని వీండ్లకు సాధ్యంకాదు. అది తెలిసి ఐశ్వర్యవంతులు తక్కినవన్నీ అరుపుకున్నారు. స్వర్గం భూలోకం విడువంగనే నరకమూ, దుఃఖమూ, అత్యాశా, అతృప్తి, లోభమూ, దారిద్ర్యమూ, పస్తులూ అతిశయించినవి. ఇసుక మేట వేసినట్టు ధనం యేకొద్దిమంది దగ్గరనో చేరింది. ఒక చోట పల్లం చేస్తేనేగాని వేరొక చోట మెట్టయేర్పడదు. భూమి కుంగి చెరువయితే ప్రక్కన కొండ ఒకటి పైకుబుకుతుంది. ఒక ద్వీపం మణిగి వేరొక ద్వీపమేర్పడుతుంది. అశేష జనులూ దరిద్రులై యెవరో కొందరు భాగ్యవంతులయినారు. భాగ్యవంతులకే భాగ్యం. దరిద్రులకే దారిద్ర్యం నిలకడయింది. రెండూ పెంపు గూడా అవుతున్నవి. సమర్థులయి ఇతరుల ధనమపహరించినవారికే గాక, అప్రయోజకులయినవారి సంతానానికే వారసత్వ ప్రకారం రావలసిందని చట్టాలు చేసుకొన్నారు. కష్టపడి, పంటలు పండించి, చేతిపనులు చేసి అమర్చిన

పదార్థమంతా ధనవంతులపహరించి, తిని, తొక్కి, తొంబాడి, శ్రమపడి పనిచేసేవాండ్లకు ఆహారం లేకుండా చేస్తున్నారు. వీటికనుకూలంగా చట్టాలుకూడ చేసుకొన్నారు. భాగ్య వంతులు బీదలను దోచుకుంటే దాని పేరు వ్యవహారం. బీదలు తమ హక్కును తీసుకుంటే చౌర్యం. బీదల దగ్గరనుంచి మోసం చేసి ఆకర్షించిన ధనం మరల బీదలు లాక్కుంటే యెట్లా తప్పయిందో కోర్టువారు నిర్ధారణచేయగోరుతున్నాను. ఇటువంటి అక్రమ చట్టాల ఔరస సంతానమే బీదలనేరాలు. అశాస్త్రీయ చౌర్యములకంటె, శాస్త్రీయ చౌర్యములే లోకానికెక్కువ హాని చేస్తున్నవి. భాగ్యవంతులకుపయోగించేది చట్ట సమ్మతం. కానిది నేరం. భాగ్యవంతుల ప్రాణానికి విలువ యెక్కువ. బీదవానికంటే భాగ్యవంతుని శునకమే అతిశయం. బీదలోడ్చిన చమటా, రక్తము కరుడుగట్టి ధనికుని భాగ్యం అవుతుంది. కానీ యిది భాగ్యవంతుడంగీకరించడు. భాగ్యవంతుడు పేదవానికెంత అవసరమో, పేదవాడు భాగ్యవంతునకంత అవసరం. కాని భాగ్యవంతుడది గుర్తించడు. బీదవాండ్లను భాగ్యవంతుల క్షేమానికి భగవంతుడు సృష్టించాడనే వాండ్ల నమ్మకం. అంతకు తప్ప బీదల జన్మలు ప్రయోజనకారులు గావు. అందువల్ల భాగ్యవంతులకుపయోగపడని బీదవాండ్లుండనవసరం లేదు. ఇది కలియుగ ధర్మం. మతకర్తల బోధలు వారి అనుచరులకక్కర లేదు. వారి ధర్మాలకనుగుణమయిన కృతయుగ ధర్మాలను పునరుద్ధరించవలెనని నా ప్రయత్నము. కలియుగములో రాక్షసులు లేరంటారు. గాని ధనికులే కలియుగ రాక్షసులు. మా సంతానుల చర్యవల్ల ధనికుల భారం తగ్గుతుంది. బీదలకు సుఖం కలుగుతుంది. దేశమాత ప్రసాదించగల సౌఖ్యాలు ఆమె సంతానమంతా సమానంగా అనుభవించడానికవకాశం గలిగి యిహమే స్వర్గమవుతుంది. దేవరాజ్యం భూమిమీద తిరిగి పునస్థాపితం కావడమే నా పరమావధి. నాపరమావధే నా దేవుడు. దానిని పొందడమే నాకానందం.

కో : ధన ధాన్యాలు, సుఖ దుఃఖాలూ పూర్వ జన్మ కర్మల వల్ల మానవులకు లభింపవా? తక్కువ నోములు నోచి యెక్కువ కోరికలు కోరితే యేమి ప్రయోజనం?

వెం : పూర్వజన్మకర్మలవల్లనే లభిస్తమనుకోండి. భాగ్యవంతులకు ప్రాప్తముండే వారు బీదలధనాన్ని అపహరించారు. ఇప్పుడూ పూర్వ జన్మ కర్మఫలం చేతనే బీదలు తమ న్యాయార్జితాన్ని తిరిగిపొందుతున్నారు.

కో : అయితే సంతానులు శిక్షింపబడుతున్నారు గదా?

వెం : అవును. భాగ్యవంతులబాట సాగినంతవరకు శిక్షింపబడుతూనే ఉంటారు. భాగ్యవంతులు తమ వర్తనను మార్చుకోకపోతే బీదలే చట్టాలు మార్చి లోకంలో భూతల స్వర్గం స్థాపిస్తారు. ఈ ధర్మం నెరవేరడానికి దయాసత్యశౌచాలు సాధనంగా తీసుకొంటాం. నా హయాంలో జరిగిన ఒక్క బందిపోటులో కూడా హత్యలు జరుగలేదు. నా అనుచరులు మద్యపానం, వ్యభిచారం విడిచిపెట్టినారు. నాది హృదయరాజ్యం. నా రాజ్యం నశించదు. నేబోయినతరువాత గూడా అది నిలిచే ఉంటుంది. జనుల హృదయ పీఠాలలో నా సింహాసనం నిలిపాను. నా ధర్మాలు అమలులోకి రాక తప్పవు. పాలనా పద్ధతులు అవసరాన్ని బట్టి మారుతుంటవి.

కో : ముగించావా? (సశేషం)

# సున్నిత హృదయుడు, ఉర్దూ కథకుడు
# సాదత్ హసన్ మంటో

- డా॥ మానేపల్లి

భారతదేశం - రెండు భాగాలుగా విడిపోయినప్పుడు విపరీతంగా తల్లడిల్లిపోయి, మానసికంగా ఎంతో ఆందోళనకు గురయిన వాళ్లల్లో సాదత్ హసన్ మంటో ఒకడు. ఆయన ఒక గొప్ప ఉర్దూ రచయిత. ఏ సాహిత్య ప్రమాణాల ప్రకారం చూసినా ఆయన నిస్సందేహంగా ప్రపంచ కథా రచయితల్లో ఒకడు. ఆధునిక ఉర్దూ సాహిత్యానికి చిన్నకథను నేర్పిన వాళ్లల్లో ప్రథమ గణ్యుడు. భారతదేశం వెలుపల మంటోకి రాదగినంత కీర్తి రాలేదు.

దేశ విభజనలో పంజాబ్ రాష్ట్రం రెండు ముక్కలుగా విడిపోయింది. ఒక ముక్క ఈనాడు పాకిస్తాన్‌లో వుంది. ఆ భాగంలో సాంబ్రాలాలో 1912లో పుట్టాడు సాదత్ హసన్ మంటో. నలభయి మూడేళ్ల నడివయసులో 1955లో లాహోర్‌లో మరణించాడు. రెండు దశాబ్దాల సాహితీ సృజనలో 200కు పైగా కథలు రాశాడు, ఎన్నో నాటికలు కూడా రాశాడు. ఆయన ప్రధాన రంగం మాత్రం చిన్న కథ.

అమృతసర్ ప్రాంతానికి చెందిన ఒక మధ్య తరగతి కాశ్మీరీ కుటుంబంలో జన్మించాడు. చదువు అంతగా అబ్బలేదు. స్కూలు ఫైనల్ పరీక్ష వరసగా రెండుసార్లు తప్పాడు. ఆ తరువాత సంవత్సరాల్లో ఏ ఉర్దూభాషా సాహిత్యాన్నయితే సుసంపన్నం చేశాడో ఆ ఉర్దూలోనే పరీక్ష తప్పాడు. 1931లో అమృతసర్ కాలేజీలో చేరాడు. మొదటి సంవత్సరం పరీక్ష రెండుసార్లు తప్పి ఇక కాలేజీ చదువు మానేశాడు. దేశం మొత్తం జాతీయోద్యమంలో అట్టుడికి పోతున్న సమయంలో, ఎన్నెన్నో కీలక సంఘటనల్ని కళ్లారా చూశాడు మంటో. జలియన్‌వాలాబాగ్ దురంత సమయంనాటికి ఆయన వయసు ఏడు సంవత్సరాలు. ఆ రక్త సిక్త దుష్ఫలితాన్నించి అటు బ్రిటీష్ సామ్రాజ్యంకాని, ఇటు భారత ప్రజలు కాని కోలుకోనే లేదు. చివరికి ఆ దుస్సంఘటన జరిగిన 28 సంవత్సరాలకు బ్రిటీష్ సామ్రాజ్యం అంతిమంగా అస్తమించక తప్పలేదు.

1920ల దశాబ్దం అంతా పంజాబ్, ముఖ్యంగా అమృతసర్ కోలుకోనేలేదు. సహాయ నిరాకరణం ముమ్మరంగా సాగుతున్న రోజులవి. ఇదంతా చూస్తూ మంటో ఎంతో అసహనంతో ఊగిపోయాడు. ఆ సమయంలో ఆయన్ని ప్రగతిశీల సాహిత్యంలోకీ, రాజకీయాల్లోకీ దించినవాడు బారీ అలీగ్. ఆయన రచించిన ''ఈస్టిండియా కంపెనీ చరిత్ర'' ఎంతో ప్రసిద్ధి చెందింది. కాని అప్పట్లో అలీగ్ అనామకుడు, పోలీసుల పేరు చెబితే హడిలిపోయే పిరికి వాడు. బాగా విస్తృతంగా చదువుకున్నవాడు. మంటోలోని సాహిత్య ప్రతిభను గుర్తించి వెలికితీసే ప్రయత్నంచేశాడు. రష్యన్, ఫ్రెంచి సాహిత్యాన్ని పరిచయం చేశాడు. ప్రముఖ ఫ్రెంచి రచయిత విక్టర్ హ్యూగో (Victor Hugo) నాటకం - The Last Days of Condenced Manc ను ఉర్దూలోకి అనువదించమని ప్రోత్సహించాడు. మంటో జ్వరతీవ్రత వంటి ఉత్సాహంతో ఆ అనువాద కార్యక్రమాన్ని రెండు వారాల్లో పూర్తి చేశాడు. లాహోర్‌లోని ఒక చిన్న ప్రచురణ సంస్థ - దాన్ని ప్రచురించింది. తొలి విజయం ఇచ్చిన ఉత్సాహంతో

---

డా॥ మానేపల్లి, ఎలమంచిలి - 531 055, విశాఖజిల్లా

Oscar Wilde రచించిన Vera అనువదించాడు. 1934లో అది ప్రచురితమయింది. ఆస్కార్‌వైల్డ్ శైలికి ముగ్ధుడయిన మంటో - ఆ సరళసుందరమైన శైలిని ఉర్దూలో ప్రవేశపెట్టే ప్రయత్నం చేశాడు.

అవి భగత్‌సింగ్ అతని సహచరులు బ్రిటిష్‌వారిపై తిరుగుబాటు చేస్తున్న రోజులు. హింసను హింసతోనే ఎదుర్కోవాలనీ, సాయుధపోరాటం చెయ్యాలనీ ఒక ప్రణాళికవేసుకుని బ్రిటిష్ అధికారిని లాహోర్‌లో కాల్చి చంపారు. దేశంలో విప్లవం వీస్తున్నది. మంటో అతని మిత్రులూ అమృతసర్ వీధుల్లో తిరుగుతూ విప్లవాన్ని కలకంటుండేవారు. ఆ సమయంలోనే బారీ - మంటోని కథా రచనకు ప్రోత్సహించాడు. ఒకసారి రాశాడంటే తిరిగి చూసుకునే అలవాటే లేదు మంటోకి. మమ్మీ అనే పెద్ద కథ (సుమారు పాతిక పేజీలు) - ఎత్తినకలం దించకుండా ఒక్క ఊపులో రాశాడు. జలియన్‌వాలాబాగ్ మారణకాండ ప్రధాన ఇతివృత్తంగా రాసిన మరొకథ ఒక చిన్న పత్రికలో అచ్చయింది. అదే ఇతి వృత్తంతో అనంతర కాలంలో - ''అంతా 1919లో జరిగింది'' అనే అద్భుతమైన కథ రాశాడు.

1934లో కొన్నాళ్ళు - ఆలీఘర్ ముస్లిం యూనివర్శిటీలో చదివాడు. ఐతే అక్కడ - తొమ్మిది నెలలకంటె ఎక్కువ చదవలేదు. టీబీ వున్నదనే ఒకతప్పుడు భయంతో - మూడు నెలలు ఒక పర్వత ప్రాంత గ్రామంలో విశ్రాంతి తీసుకున్నాడు. ఆ జబ్బు టీబీ కాదని తేలిపోయింది. తిరిగి వచ్చి - అమృతసర్‌లో - ''పారస్'' అనే ఒక పత్రిక కార్యాలయంలో చేరాడు. త్వరలోనే ఆ ఉద్యోగం వదిలేసి - బొంబాయి చేరుకుని - ఒక సినీమా వార పత్రికలో చేరాడు. మిత్రుడు బారీ ఉద్యోగాన్వేషణలో రంగూన్ వెళ్ళాడు. ఆ తరవాత మిత్రులు తరచు కలవలేక పోయారు. అతని స్నేహాన్ని గురించి ఆ తరవాత ఒకసారి - ''నేను అమృతసర్‌లో బారీని గాని కలుసుకుని వుండకపోతే - రచయితను కాలేక పోయేవాణ్ణి, బహుశా ఒక క్రిమినల్‌గా మారిపోయేవాణ్ణేమో'' - అన్నాడు మంటో.

బొంబాయి నగరం అంటే మంటోకి వల్లమాలిన ప్రేమ. ఆ నగరాన్నతను రెండే రెండు సార్లు విడిచాడు. మొదటిసారి కొద్దినెలలు, రెండవసారి ఇకపూర్తిగా. 1947లో దేశవిభజన తరవాత లాహోర్ వెళ్ళిపోయాడు. ఆ చివరి సంవత్సరాల్లో ఆయన చాలా విరివిగా రచనలు చేశాడు. కాని భయంకరమైన పేదరికం, అనారోగ్యం, ఎడతెగని తాగుడు, బాంబే విడిచిపెట్టినందుకు చాలాచాలా బెంగపెట్టుకున్నాడు.

కొన్నాళ్ళు సినిమా రంగంలో పనిచేశాడుగాని చెప్పుకోదగిన ప్రోత్సాహం ఏమీ లేదు. ఉర్దూ కథా సంపుటి - 1940లో ప్రచురితమైంది. 1942లో ఒక వ్యాస సంపుటి. ఆ తరవాత ఢిల్లీ వచ్చి - ఆలిండియా రేడియోలో ఉద్యోగం చేశాడు. ఆ సమయంలోనే తల్లి మరణించింది, తొలిచూలు మగ బిడ్డ మరణించాడు.

ఢిల్లీలో దాదాపు రెండేళ్లు గడిపిన తరవాత - బొంబాయి వెళ్ళాడు. మళ్లీ కొన్నాళ్లు సినిమా రంగంలో పనిచేసి - చాలా సినిమాలకు స్క్రిప్టులు, స్క్రీన్‌ప్లేలు రాశాడు. ఇంతలో - 1947 ఆగస్టు 14 - దేశ విభజన - మంటో భార్యా బిడ్డలు ఇప్పుడున్నది విదేశంగా మారిపోయింది, దానిపేరు పాకిస్తాన్. అతనుద్యోగం చేస్తున్న బాంబే టాకీస్ సినిమా కంపెనీలోని - ముస్లింలందర్ని ఉద్యోగంలోంచి తొలిగించాలి, లేకపోతే కాల్చేస్తాం, సర్వంనాశనం చేసేస్తాం - అని దుండగులు బెదిరించారు. ఉద్యోగం

పోయింది. మూటాముల్లె సర్దుకుని బొంబాయి రేవులో ఓడ ఎక్కి - పాకిస్తాన్ రాజధాని కరాచీ చేరుకున్నాడు. జనవరి 1948లో జాతి దురహంకారం పెచ్చరిల్లింది.

సాదత్‌హసన్ మంటో మరణానికి - సరిగ్గా రెండేళ్లముందు అతని మిత్రుడు శ్యాం - ఒక ప్రమాదంలో మరణించాడు. బొంబాయిలో తన చివరి రోజుల్ని మంటో ఒక కథలో అత్యంత విషాదంగా చిత్రించి - ఆ కథను శ్యాంకు అంకితం ఇచ్చాడు. ఆయనకు పతివ్రతలుగా చెప్పుకునే వారికంటే వ్యభిచారులు చాలా నీతి మంతులుగా కనిపించేవారు. ఉన్నతోద్యోగులకంటె రౌడీలు ఎంతో మానవతా వాదులుగా కనిపించేవారు. అభ్యుదయ రచయితల సంఘం - ఆయన్ని 'విప్లవవ్యతిరేకి' అని ముద్రవేసింది. ఆ ముద్ర నాయన ఒక 'బహుమతి'గా భావించారు. కొందరాయన్ని 'అశ్లీల రచయిత' అన్నారు.

ఆయన తరం రచయితల్లో 1947 నాటి రక్తపాత సంఘటనల్ని సాహిత్యానికెక్కించినవాడు ఆయనొక్కడే. హిందూ, ముస్లిం, సిఖ్ఖు - విభేదాలంటే అస్సలు ఇష్టం వుండదు. ''తోబా టేక్‌సింగ్'' కథ ఇందుకు ప్రబల సాక్ష్యం. సంప్రదాయాలు, ద్వంద్వవైఖరి, కాలం చెల్లినఛాందసభావాలు ఆయనకు పడవు.

1940ల్లో - 1948లో రెండుసార్లు ఆయన రచనలపై కోర్టులో కేసులు నడిచాయి. ఆయన రచనల్లో 'అశ్లీలం', 'అవినీతి' ఉన్నాయని ఆరోపణ. ఒక కథలో - విభజన సమయంలో ఒకమ్మాయిని హిందువులు, సిక్కులు ముందు రేప్ చేస్తారు, తరవాత ఆమె స్వంత ముస్లిం మతస్థులే రేప్ చేసి - చచ్చి పోయిందని వదిలేసి పోతారు. దీన్ని కొందరు విమర్శకులు అశ్లీలం, అవినీతి - అన్నారు. ఈ కేసు నెలల తరబడి ఈడ్చింది. లాహోర్‌కోర్టు ఆయనకు జరిమానా, మూడు నెలల జైలు శిక్ష విధించింది. దీనిపై ఆయన సెషన్స్‌కోర్టుకు అప్పీలు చేశాడు. అక్కడ కేసు కొట్టేశారు. కట్టిన జరిమానా తిరిగి ఇచ్చేశారు. ఐతే ఆ జరిమానా సొమ్ము ఆయన కట్ట లేదు.

మంటోకి ప్రజలంటే ఎప్పుడూ ఎనలేని ప్రేమ. కమ్యూనిజం అన్నా, రష్యా అన్నా వ్యతిరేకత లేదు. కాని ప్రతిదానికీ రష్యా నాయకుల్ని ఉదహరించడం ఇష్టపడేవాడు కాదు.

మరణానికి ఒక ఏడాది ముందు, 1954 ఆగష్టు 18వ తేదీన, ఆయన తన చరమగీతం తానే రాసుకున్నాడు.

''ఇక్కడ సాదత్ హసన్‌మంటో శాశ్వత విశ్రాంతి తీసుకుంటున్నాడు. కథా రచనలోని మెళుకువలూ, నైపుణ్యాలూ ఆయనతో సమాధిలో నిద్రిస్తున్నాయి, భూమి అడుగు పొరల్లో.''


తన కోసం ఏడిచే వాళ్లంటే ఇష్టం వుండదు. ''నాజేబుల్లో చిల్లర డబ్బులున్నాయి. మరికొన్ని డబ్బులు వేసి నాక్కాస్త విస్కీ తెచ్చిపెట్టండి'' - ఇదే అతని ఆఖరి కోరిక. రక్తం కక్కుకుంటూ మరణించాడు. ఉర్దూ సాహిత్యం మొత్తంలో మంటోను మించిన కథా రచయిత పుట్టలేదు.

ఆయన కథలు - ఒక పాతిక - ఇంగ్లీషు అనువాదమై పుస్తక రూపంలో లభిస్తున్నాయి. (పెంగ్విన్ - 1987). ఆయన రచనలు ఉర్దూలో ఐదు సంపుటాలుగా లభిస్తున్నాయి. వాటి తెలుగు అనువాదాలు - నేరుగా ఉర్దూ నుంచి - వస్తే తెలుగు పాఠకులకు ఆయన వ్యక్తిత్వం, ప్రతిభ - మరింత స్పష్టంగా సాక్షాత్కరిస్తుంది.



## నగరంలో నృత్యం (1883)

1883లో రెనార్‌ను గ్రామీణ, నగర శైలులను ప్రతిబింబించే రెండు చిత్రాలను వేయమని కోరడం జరిగింది. ఇది నగరశైలి నృత్యం. ఈ చిత్రంలో శీతల వర్ణాలు, అవైయక్తిక నేపథ్యం, నర్తకుల ఆకర్షణీయమైన దుస్తులు బాగా బలిసిన పారీస్ వాసుల సంక్లిష్టమైన తీరు తెన్నులు దర్శనమిస్తాయి.



రెనార్‌కు లీసె మోడల్‌గా, ఉంపుడుగత్తెగా ఉండేది. ఆమెను వివిధ వేషాలతో చిత్రించడం అతనికి ఇష్టం.

ఈ చిత్రంలో అతడు ఆమెను ఆల్జీరియా జనానాకు చెందిన ప్రాచ్య విమోహినిగా చిత్రించాడు.

ఆమె ఈ చిత్రంలో కన్నుగీటి ఆహ్వానం పలుకుతోంది. కాని ఈ చిత్రంలో కనిపించే దానికి, అసలు ఆమెకు (లీసె) దూరం హస్తిమశకాంతరం.